Estd:2023

3rd ANNIVERSARY

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

RNI. NO.: TELTEL/2023/85598

www.sooryasena.com








| శనివారం SATURDAY | 06.06.2026 | నల్గొండ NALGONDA | సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 260 | పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- | ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah |
|---|---|---|---|---|---|


# మోదీ నాకు మంచి మిత్రుడు: ట్రంప్



ఫైల్ ఫోటో

**న్యూఢిల్లీ, జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు మంచి మిత్రుడని, భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం తప్పకుండా కుదురుతుందనే నమ్మకం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. వైట్ హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడిన ట్రంప్, భారత్‌తో జరుగుతున్న వాణిజ్య చర్చలపై స్పందించారు. మీ ప్రధానమంత్రి అంటే నాకు చాలా ఇష్టం. ఆయన నా మంచి మిత్రుడు. మా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఉంది. కాబట్టి మేము తప్పకుండా ఒక ఒప్పందానికి చేరుకుంటాం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే గతంలో భారత్ అమెరికా కంపెనీలపై భారీ సుంకాలు విధించిందని ఆయన విమర్శించారు. అమెరికా సంస్థలపై భారత్ అత్యధిక దిగుమతి సుంకాలు విధించేదని, కానీ అమెరికా మాత్రం భారత ఉత్పత్తులపై అలాంటి సుంకాలు విధించలేదని పేర్కొన్నారు. ఇటీవల అమెరికా ప్రతినిధి బృందం భారత్‌లో నాలుగు రోజులపాటు వాణిజ్య చర్చలు నిర్వహించిన విషయాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ఈ చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని, పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ కూడా తెలిపింది.

2వ పేజీ లో...

## 30నెలల మా పాలనపై చర్చకు

# సిద్ధం



**మహబూబ్‌నగర్ జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** వచ్చే పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి మరోసారి కుండబద్దలు కొట్టారు. శుక్రవారం జడ్చర్ల శివారులోని గంగాపూర్ గ్రామం వద్ద పజాపాల న ప్రగతి ప్రణాళికపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు.

రెండు రోజుల పా టు ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాల హ యాంలో నిర్మించినవి తప్పితే బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు నిర్మా ణం జరగలేదని సీఎం ఆరోపించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో కోట్లు దండుకున్నదని ఆరోపించారు. మీ పదేళ్ల పాలనపై చర్చకు అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ సవాల్ విసిరారు. మా 30 నెలల పాలనపైనా చ ర్చిద్దాం. ఒకవేళ చర్చలో ఓడిపోతే క్షమాపణ చెబుతానని సిఎం స్పష్టం చేశారు.

2వ పేజీ లో...


# భారత్‌లో ఎయిర్ ట్రంక్..



**న్యూఢిల్లీ, జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** భారీ సాంకేతిక కంపెనీ ఎయిర్ ట్రంక్ భారత్‌లో రూ 3 లక్షల కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం తెలిపారు. ఆస్ట్రేలియాకు చెందిన ఈ ఆసియా పసిఫిక్ , మిడిలిస్టు టెక్నాలజీ కంపెనీ , ఎయిర్ ట్రంక్ వ్యవస్థాపకులు , సిఇఒ రాబిన్ ఖుదాతో ప్రధాని మోడీ శుక్రవారం కీలక భేటీ జరిపారు. తరువాత మోడీ ఎక్స్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ కంపెనీ పెట్టుబడుల విషయం తెలిపారు. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ డెటా సైన్స్ కంపెనీగా ఎయిర్ ట్రంక్ ప్రపంచ ఖ్యాతి పొందింది. భారత్‌లో 2030 నాటికే 30 బిలియన్ డాలర్లు అంటే రూ 3 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులకు కంపెనీ ముందుకు రావడం కీలక విషయం అని ప్రధాని మోడీ తెలిపారు. ప్రత్యేకించి భారత్‌లో పెద్ద ఎత్తున 5 జిడబ్లు టెడా సెంటర్ సామర్థం సంతరించుకునే రీతిలో కంపెనీ పెట్టుబడులు ఉంటాయి. మన దేశ డిజిటల్ మౌలిక వ్యవస్థకు సంబందించి భారీ పెట్టుబడుల ప్రక్రియలో ఇదే అత్యధిక వాటా అవుతుందని ప్రధాని మోడీ తెలిపారు. ఇటువంటి అత్యున్నత స్థాయి క్లౌడ్ కంప్యూటింగ్,ఎఐ సాంకేతికతతో మనం అంతర్జాతీయ స్థాయిలో ఈ రంగాలలో కీలక కేంద్రంగా రూపుదిద్దుకోవడం జరుగుతుంది. స్థానిక ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

## రూ.30వేల కోట్ల విలువైన భూమికి...

# హైడ్రా కంచె



**హైదరాబాద్, జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు న హైదరాబాద్ మహానగర శివారులోని పుప్పాలగూడలో హైడ్రా భారీ ఆపరేష న్ నిర్వహించింది. ప్రకృతిని పరిరక్షిస్తూ చారిత్రాత్మక చరిత్ర ఉ న్న రాళ్లగుట్టలను రక్షించింది. అతి పురాతన గుహలు, వాటి మధ్యన ఉ న్న చెట్లను.. సహజసిద్ధమైన ప్రకృతి ని హైడ్రా కాపాడింది. నగర శివారు ప్రాంతమైన గండిపేట మండలం పుప్పాలగూడ– ఖాజాగూడ గ్రామా ల సరిహద్దుల్లో శు క్రవారం 198 ఎ కరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ప రిరక్షించింది. గతంలో హెచ్ఎండీఏకు రాష్ట్ర ప్రభు త్వం కేటాయించిన భూమి కూడా ఉంది. చారిత్ర క గుట్టలను కాపాడాలని కోరుతూ దశాబ్దాలుగా 'సొసైటీ టూ సేవ్ రాక్స్' ప్రతినిధులు పోరాడుతున్నారు. వీరు హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ మేరకు రాతి గుట్టలతో పాటు.. ప్రభుత్వ భూ మిని కాపాడాలని 2019లో మున్సిపల్, రెవెన్యూ శాఖలను హైకోర్టు ఆదేశించింది.

2వ పేజీ లో...






## సింగరేణి అవినీతిపై బిఆర్ఎస్...

# జంగ్ సైరన్



**హైదరాబాద్, జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** సింగరేణిలో జరిగిన రూ.1600 కోట్ల భారీ కుంభకోణంపై వెంటనే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లేఖ రాశారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల స్కామ్ జరగడం సంస్థ మనుగడనే ప్రమాదంలోకి నెడుతోందని, సింగరేణి అధికారిక వెబ్ సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించకపోవడం ఈ కుంభకోణాన్ని తేటతెల్లం చేస్తోందని తెలిపారు. 40 లక్షల టన్నుల బొగ్గు మీద కోల్ సెస్‌తోపాటు, ఇన్ కమ్ టాక్స్ కూడా కట్టామని లెక్కలు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడం వెనక ఎవరి హస్తం ఉ ందో తేలాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రమంత్రి వర్గంలో తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించడమే కాకండా సాక్షాత్తూ బొగ్గు గనుల శాఖ చూస్తున్న మీ హయాంలో ఇంత దుర్మార్గమైన కుంభకోణం జరగడం సిగ్గుచేటు అంటూ కిషన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం- 1లో ఆరు లక్షలు, రామగుండం -2లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేలు, ఇల్లందులో 3 లక్షల 50 వేలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారని తెలిపారు. కానీ, కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారం అని వెల్లడించారు.

# వట్టెం పంప్ హౌస్ మూడో లిఫ్ట్‌ను సందర్శించిన సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్ జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను రెండు రోజులపాటు పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామం వద్ద ఉన్న వట్టెం పంపు హౌస్ మూడో లిఫ్టును సందర్శించారు. ఎస్ జె ఆర్ పిఆర్ఎల్ఐఎస్ ( పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్) లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2020- 2023 సంవత్సరం నాటికి రూ 3300 కోట్లు ప్రాజెక్టుకు ఖర్చు చేయగా, 2023వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు రూ. 800 కోట్లను ఖర్చుచేసి ప్రాజెక్ట్ పనులను కొనసాగించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగతా సివిల్ పనులను రూ.90 కోట్లతో వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇక్కడ మొత్తం 10 పంపులు ఉండగా 5 పంపులను ఫిట్ చేసి ట్రయల్ రన్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. వర్షాకాలంలో నీళ్లు రాగానే వెంకటాద్రి రిజర్వాయర్ కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం మొత్తం 16.74 టీఎంసీలు కాగా స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం ద్వారా విడతల వారీగా రిజర్వాయర్ ను నింపడం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం 12 లక్షల ముప్పై వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని



అందించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అలాగే మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలకు తాగునీటికి, పరిశ్రమలకు కూడా నీళ్లు అందుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




# భారత్‌కు సుఖోయ్-57

ఓ వైపు భారత్ పొరుగుదేశం పాకిస్థాన్ ఇటీవలి కాలంలో చైనాతో తన ఆయుధ సహకార బంధం విస్తరించుకొంటోంది.
పాత అనుభవాల నేపథ్యంలో కాలంతో పోటీ పడుతూ మరింత ముందుకు పోయే రీతిలో వినూత్న శ్రేణి ఫైటర్లను సంతరించుకొంటోంది. ఇందులో భాగంగానే చైనా నుంచి షెన్‌యాంగ్ జె 35 ఎఇ స్టెల్త్ ఫైటర్స్‌ను తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ దశలో వీటికి పోటీగా భారత్‌కు ధీటైన యుద్ధ విమానాల అవసరం ఏర్పడింది. ఈ దశలోనే సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో వార్తా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రపంచ వ్యాప్త సంచలనం అయింది. భారత్‌తో రష్యా బహుముఖ రక్షణ బంధం ఎప్పటికప్పుడు బలోపేతం అవుతుందని పుతిన్ స్పష్టం చేశారు. ఈ దశలోనే పిటిఐ ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి ప్రశ్నకు సమాధానంగా సుఖోయ్ ఫైటర్ల సరఫరాకు పుతిన్ తమ సుముఖత వ్యక్తం చేశారు. ఈ యుద్ధ విమానం పూర్తిగా రష్యాదే . అయితే భారత్‌కు పూర్తి సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చి , సంయుక్తంగా వీటిని నిర్మించేందుకు ఎటువంటి షరతులు లేవని ఆంక్షల ప్రసక్తే రాదని తేల్చిచెప్పారు. ఇక సుఖోయ్ సంయుక్త నిర్మాణం విషయంలో ఇప్పటికే భారతదేశపు ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్) రష్యాతో సంప్రదింపులలో ఉంది. భారత్, రష్యా చైనా మధ్య త్రిముఖ బంధం అత్యంత చారిత్రకం, ఈ కోణంలో నుంచి తలెత్తిందే ఇప్పటి బ్రిక్స్ అవతరణ అని పుతిన్ తెలిపారు. రష్యాలో చర్చల వేదిక ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని తాను ప్రధాని మోడీ, జిన్‌పింగ్‌కు ఓసారి సూచించానని దీనితోనే తమ దేశాల మధ్య బంధం ఏ స్థాయిలో ఉందనేది తెలుసుకోవచ్చునని తెలిపారు. పాకిస్థాన్ ఇతర అంశాల గురించి కూడా పుతిన్ మాట్లాడారు. ఇటీవలి కాలంలో పుతిన్ ఇంతటి సదీర్ఘ ఇంటర్వ్యూ ఇవ్వడం , కీలక విషయాలను ప్రస్తావించడం ఇదే తొలిసారి అయింది. పాకిస్థాన్ ఇప్పుడు చైనా కంట్రోలులో పనిచేస్తోందనే వాదన సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ , చైనాల సబంధాల విషయం అత్యంత సంక్లిష్టం, సున్నితం , వీటిలో రష్యా ఎట్టి పరిస్థితుల్లోనూ కలుగచేసుకునే ప్రసక్తే లేదని రష్యా నేత పుతిన్ స్పష్టం చేశారు. అయినా ప్రధాని మోడీ, చైనా నేత జిన్‌పింగ్‌లు సరిహద్దు సమస్యలను తగు విధంగా సామరస్యంగా పరిష్కరించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు మోడీ, జిన్‌పింగ్ ఇద్దరూ కావల్సిన వారే అని, ఇరువురి కార్యదక్షత, సమర్థత కొనియాడాల్సిందేనని పుతిన్ తెలిపారు. 2030 రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ విషయం గురించి తాను ఇప్పుడు చెప్పలేమని, అప్పటికి తన ఆరోగ్యం ఏ విధంగా ఉంటుందనేది ఆ దేవుడికే తెలుసునని వ్యాఖ్యానించారు. పవర్‌లో ఉన్నప్పుడు తాను పరిష్కరించాల్సిన విషయాలు మిగిలి ఉన్నాయని వెల్లడించారు.

# మోదీ నాకు మంచి మిత్రుడు: ట్రంప్

**1వ పేజీ తరువాయి**

ఈ సందర్భంగా ప్రముఖ అమెరికన్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హార్లే దేవిడ్‌సన్ ఉదాహరణను ట్రంప్ ప్రస్తావించారు. గతంలో హార్లే-డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్లపై భారత్ 200 శాతం వరకు సుంకాలు విధించింది. దీంతో ఆ సంస్థకు భారత్‌లో వాహనాలు విక్రయించడం కష్టమైంది. చివరకు భారత్‌లోనే తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి వచ్చింది అని ఆయన అన్నారు. దీనికి విరుద్ధంగా భారత మోటార్‌సైకిళ్లకు అమెరికా మార్కెట్లో ఎలాంటి అడ్డంకులు లేవని ట్రంప్ పేర్కొన్నారు. భారత కంపెనీలు అమెరికాలో మోటార్‌సైకిళ్ల విక్రయించాయి. వాటిపై మేము ఎలాంటి సుంకాలు విధించలేదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. భారత్‌తో వాణిజ్యం ద్వారా మేము గణనీయమైన ఆదాయం పొందుతున్నాం అని చెప్పారు.
ఈ ఏడాది ఫిబ్రవరి 7న ట్రంప్, మోదీ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) తొలి దశకు సంబంధించిన రూపురేఖలను ఇరు దేశాలు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదన ప్రకారం భారత ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న కొన్ని సుంకాలను తగ్గించేందుకు అంగీకరించింది. అయితే అనంతరం అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ ప్రతిపాదించిన పరస్పర సుంకాల విధానంపై కీలక తీర్పు ఇవ్వడంతో పరిస్థితులు మారాయి. దీంతో అమెరికా అన్ని దేశాలపై తాత్కాలికంగా 10 శాతం సుంకాలను అమలు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై మళ్లీ చర్చలు కొనసాగుతున్నాయి.ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్, అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉన్న అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ చర్చలు కీలకంగా మారాయి. ఇరు దేశాలు పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రూ.30వేల కోట్ల విలువైన భూమికి హైడ్రా కంచె

**1వ పేజీ తరువాయి**

హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడం జాప్యం కావడంతో కబ్జాల కు ఆస్కారం ఇచ్చినట్టయింది. ఇదే విషయాన్ని సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
ఈ ఫిర్యాదులను రెవె న్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హై డ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ భూమి విలువ రూ.30 వేల కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్ 452 /1లో 174 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 454 /1 సర్వే నంబర్‌లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం 293.05 ఎకరాలు కాగా.. ఇందులో 263.05 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. రెండు గ్రామాల మధ్య ఓవర్‌ల్యాప్ ఇష్యూలతో 63.05 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో హెచ్ఎండీఏకు 200ల ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇవే చారిత్రక గుట్టల ప్రాంతంలో వివిధ దేవాలయాలకు 5 ఎకరాలు కేటాయించగా.. దర్గాకు 5 ఎకరాలు అప్పజెప్పినట్టు రెవెన్యూ రికార్డులు చెప్తున్నాయి.
ఇలా వారికి కేటాయించిన భూములు పోగా.. 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు కోరిన విధంగా అక్కడ చారిత్రక బండ రాళ్లను కూడా హైడ్రా కాపాడింది. మంచి వ్యూ పాయింట్‌తో... ఎంతో ఎత్తుగా.. సహజసిద్ధంగా ఉన్న గుట్టలకు శతాబ్దాల చరిత్ర ఉన్న కొండలను కాపాడి ప్రకృతిని పరిరక్షించారంటూ రాక్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాను కొనియాడారు. రాళ్ల గుట్టలతో పాటు పలు ఆలయాలున్న చారిత్రక స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కాపాడిన హైడ్రాకు ప్రజలతో పాటు భక్తులు, పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలిపారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవను అభినందించారు. ఈ గుట్టలను ఆనుకొని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒక పక్క ఎత్తైన కొండ.. దిగువ భాగంలో ఉన్న భగీరథమ్మ చెరువు సిద్ధమైతే.. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# 30 నెలల మా పాలనపై చర్చకు సిద్ధం

**1వ పేజీ తరువాయి**

2009న కరీంనగర్ జిల్లాలో ఓడిపోతానని అక్కడ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, మళ్లీ వాళ్ల చేతికి దొరికితే చీల్చి చితక్కొడతారని, అక్కడినుంచి ఇక్కడికి ఒక నాయకుడొచ్చిండని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం అన్నారు. ఉద్యమం పేరు చెప్పిండు. పాలమూరు జిల్లా వలసల గురించి రైతుల ఆత్మహత్యల గురించి, కాలిపోతున్న మోటర్ల గురించి, పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల గురించి ప్రస్తావించి పాలమూరు ప్రజలను మోసం చేశాడన్నారు. కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తా అని మన దగ్గరికి వచ్చిండు. వలస కష్టాలు మనకు తెలుసు, ఆత్మహత్యలు గురించి తెలుసు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌కు సొంత ఇళ్లు లేకపోయినా భుజాల మీద మోసి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించామన్నారు. ఐదుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నా, ఐదు సార్లు కూడా మన జిల్లాకు మనల్ని కలవడానికి రాకపోయినా మనమేమి అనుకోలేదన్నారు. పార్లమెంట్‌లో మన రాష్ట్రం గురించి మాట్లాడుతాడు కదా, రాష్ట్రం వస్తే గుర్తుపెట్టుకొని మన జిల్లాను బాగు చేస్తాడు కదా అని భావించినా కేసీఆర్ అలా చేయలేదన్నారు.

**తల్లిగా సోనియా ఆలోచించి తెలంగాణ ఇచ్చింది**

దేవుడు కరుణించిండు, సోనియా ఆశీర్వాదం, మన్మోహన్ సింగ్ చట్టం చేస్తే 2014, జూన్ 2 నాడు 60 సంవత్సరాలు కలలుగన్న తెలంగాణ రాష్ట్రాన్ని చూస్తామనో చూడమనో భావించామన్నారు. ఆత్మహత్యలు చేసుకొని, బలిదానాలు చేసుకుంటున్న సందర్భంలో ఇక ఏ తెలంగాణ బిడ్డ మరణం చూడొద్దు. ఏ ఆడబిడ్డకు కడుపు కోత ఉండొద్దని ఆ తల్లుల దుఖాన్ని ఆపాలని సోనియమ్మ ఓ తల్లిలా, ఓవైపు ఏపీలో పార్టీ నష్టపోయినా కేంద్రంలో అధికారం కోల్పోయినా, తెలంగాణ ఒడిదుడుకులు ఎదుర్కొన్నా సువర్ణాక్షరాలతో తెలంగాణ రాసి రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న రాష్ట్రానికి మేక వన్నె లాంటి కేసీఆర్‌ను గొర్రె కసాయిని నమ్మినట్లు ఒక్కసారి కాదు, రెండుసార్లు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేశారన్నారు. రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.8 లక్షల కోట్లు రూపాయలు చేతికిస్తే పాలమూరు జిల్లాలోని ఏ ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదన్నారు.

**ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనివే**

నాడు జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ప్రాజెక్టులు, జలయజ్ఞం కింద డాక్టర్ వైఎస్ఆర్ నిర్మించిన ప్రాజెక్టులు తప్ప ఒక్క ప్రాజెక్టు బీఆర్ఎస్ పూర్తిచేయలేదన్నారు. మన కష్టాలను, కన్నీళ్లను పట్టించుకోని కేసీఆర్ సాగునీరు, తాగునీరు కూడా మనకు దక్కకుండా చేశారన్నారు. కొందరు ఇవాళ దొంగలకు సద్దులు మోసినట్లు తిన్నింటి వాసాలు లెక్కబెట్టేటోళ్లు, అన్నం పెట్టినోడికి సున్నం పెట్టినోడు పాదయాత్రలు చేస్తామంటున్నరు. మీరు పాదయాత్ర కాదు, పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు చేసుకుంటూ పోయినా మీరు చేసిన పాపాలు తీరవన్నారు. ఆ నాడు ప్రారంభించిన జూరాలను మేమే పూర్తి చేసినామని, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు రంగారెడ్డి, నాడే మంజూరైన మఖ్తల్ నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టులను పూర్తిచేశావా అని సీఎం రేవంత్ కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. మీ సమస్యలను ఏమైనా ఉన్నాయా అని ఏనాడైనా రైతులను ఆడిగినావా? అని నిలదీశారు.

**నీ కుమారుడు, నీ మనవడే రాజ్యమేలాలా?**

కేసీఆర్, ఆ తర్వాత ఆయన కొడుకు, ఆ తర్వాత ఆయన మనవడు రాజ్యమేలాలంట. మన దళితులు చెప్పులు కుట్టుకోవాలంట, ముదిరాజులు చేపలు పట్టాలంట, యాదవులు గొర్రెలు, బర్రెల్ని కాచుకుంటే ఆయన, ఆయన మనవడు రాజ్యమేలుతాడంట అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఇవాళ నల్లమల్లలోని మారుమూల పల్లె నుంచి ఒక బిడ్డ 20 ఏండ్ల క్రితం జూలై 4న ఇదే మిడ్జిల్ నుంచి జడ్పీటీసీగా గెలిపించి ఒక చిన్న మొక్కగా నాటి నన్ను పంపారన్నారు. ఆ చిన్న మొక్క 20 సంవత్సరాలల్లో జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా, పార్టీ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా మీ బిడ్డ వృక్షమై నిలబడ్డాడన్నారు.

**1.80 కోట్లు ప్రాజెక్టులకు ఖర్చుచేసి ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా?**

పదేళ్లు రూ.8 లక్షల కోట్లలో కేవలం సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.1.80 కోట్లు ఖర్చుపెట్టిన కేసీఆర్ ఉదండాపూర్ రైతులకు రూ.800 కోట్లు ఇవ్వలేక పోయారన్నారు. అదే మనోడై ఉంటే ఇచ్చేటోడు కదా అని అన్నారు. వాడు ఎక్కడోడో కాబట్టి మన మీద కక్షతోని, అహంకారంతోటి మనల్ని పట్టించుకోలేదన్నారు. మన జిల్లా బిడ్డగా ముఖ్యమంత్రిగా అయినా కాబట్టే రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికి రూ. 22 వేల కోట్లు మంజూరు చేస్తే పాలమూరు ప్రాజెక్టుల కోసమే రూ. 8 వేల కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

**జైళ్లు కట్టాలని వారు చూస్తే మేము బడులు కడుతున్నాం**

జైళ్లు కట్టాలని వాళ్లనుకుంటే స్కూళ్లు కట్టాలని మేం అనుకుంటున్నామని సీఎం అన్నారు. ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్‌లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగులు నింపుతుందని సీఎం అన్నారు. జిల్లాలో వలసలు ఆగాలన్నా రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తికావాలన్నారు. హనుమాండ్ల గుడి లేని తండా, గూడెం లేదోమో కానీ ఇందిరమ్మ ఇల్లు లేని గూడేలు లేవన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిన గ్రామాల్లో మీరు ఓట్లు అడగండి.. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన గ్రామాల్లో మేము ఓట్లు అడుగుతామని, మీకు డిపాజిట్ వస్తే చూస్తామని సవాల్ విసిరారు. పాలమూరు ప్రజలకు మట్టితీసుడే కాదు మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. కేసీఆర్ రాసిపెట్టుకో పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొందబెడతామని హెచ్చరించారు.
జిల్లాలో మీ పార్టీకి చెందిన వారిని ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనీయమని సీఎం హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ఏమి చేసిండని కొందరు అవాకులు చెవాకులు పేలుతున్నారని 15 లక్షల రేషన్ కార్డులు అందించామన్నారు. గతంలో ఏ నా కొడుకు కూడా ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారా అని నిలదీశారు. 4.50 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామన్నారు. పది వేల కోట్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయణం కోసం ఖర్చు చేశామన్నారు. ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం, చెబితే మహాభారతం అవుతుందన్నారు.

**పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధం అసెంబ్లీకి వచ్చే ధైర్యం ఉందా?**

పదేళ్ల పాలనపై మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం అసెంబ్లీకి రావాలని కేసీఆర్‌కు సీఎం సవాల్ చేశారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. చర్చిద్దాం మాది తప్పు అయితే నేను క్షమాపణ చెప్తానని సీఎం సవాల్ చేశారు. గోదావరి జలాలపై చర్చిద్దామంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలు అడుతుండగా బీజేపీ నాయకులు తప్పించుకు తిరుగుతున్నారన్నారు. ఎన్నేళ్లు తప్పించుకుతిరిగినా, దాగుడుమూతలు ఆడినా తుమ్మిడిహట్టి కట్టితీరుతామని సీఎం తెలిపారు. బురదచల్లినా, తలకిందుల తపస్సు చేసినా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలకు ఒప్పించే బాధ్యత తీసుకుంటానని సీఎం అన్నారు. పాలమూరు జిల్లా గ్రీన్‌చానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.
పాలమూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దొంగలు వచ్చి దోపిడీదారులుగా దోపిడీ చేసేందుకు వస్తారని ఎద్దేవా చేశారు. దొంగలకు సద్దులు మోసేటోళ్లతో జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని సీఎం మరోసారి ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా నదీజలాలు వివాదం రావణకాష్టంలాగా మారింది. పరిష్కారం కావాలంటే చర్చలు వద్దా.. పరాయివాడితోనైనా సమస్య ఉంటే పంచాయితీ తెంచుకుంటామా లేదా? పక్క రాష్ట్రంతో చర్చలు చేస్తామంటే నా మీద బురద జల్లుతున్నాడు. పాలమూరు రంగారెడ్డికి 90 టీఎంసీల నీటిని తీసుకొస్తామన్నారు. ఏపీతో చర్చించి ఎన్ఓసీ ఇప్పించుకొని డిసెంబర్‌లోగా పరిష్కరిస్తామని సీఎం అన్నారు.

# మావిగన్‌తో జగన్‌కు బంపర్ మైలేజ్



విజయవాడ **జూన్ 05 (సూర్య సేన) :** వైసీపీ ట్రెడిషనల్ పాలిటిక్స్ కి దూరంగా ఉండే పార్టీ. ఒక భిన్నమైన వైఖరితో సాగే పార్టీ. ప్రచారం విషయంలో చూస్తే ఆ పార్టీ తీరే వేరుగా ఉంటుంది. అవతల ప్రత్యర్థి టీడీపీ అయితే పబ్లిసిటీ విషయంలో చాలా స్పీడ్ గా ఉంటుంది. పైగా వ్యూహాలు ఎత్తుగడలలో టీడీపీని మించిన వారు ఉండరు. అలాంటి పార్టీతో వైసీపీ ఎపుడూ పోటీపడలేని స్థితిలోనే ఉంటుంది.అలాంటివి వైసీపీ మావి గన్ అన్న ఒకే ఒక్క స్టెప్ తో ఏకంగా వంద కోట్ల రూపాయిల విలువ చేసే పబ్లిసిటీని ఫ్రీగా కొట్టేసిందా అన్న చర్చ అయితే సాగుతోంది. మావిగన్ అన్నది వైసీపీ కాకతాళీయంగా అన్నదా లేక మనసులో ఉంచుకుని సరైన సమయంలో వదిలిన పంచ్ నా లేక టీడీపీ కూటమి అమరావతి రాజధాని అన్న బలమైన స్లోగన్ ని ఎంతో కొంత అడ్డుకునేందుకు వేసిన పాచికా అన్నది తెలియదు కానీ మావిగన్ మాత్రం జగన్ నోటివెంట రాగానే సోషల్ మీడియా మొత్తం షేక్ అయింది. అంతే కాదు ఏపీ రాజకీయమంతా మొదటషాక్ అయింది ఆ మీదట హీటెక్కిపో యింది. ఇకమావిగన్ అన్నది ట్రెండింగ్‌లోఉంటూ ట్రోలింగ్ కా బాప్ అనిపించుకుంది.
ఇది నెగిటివ్ ప్రచారమా లేక పాజిటివ్ ప్రచారమా అన్నది పక్కన పెడితే వైసీపీని ఎక్కడో తీసికెళ్ళి పెట్టింది అన్నది మాత్రం వాస్తవం అని అంతా అంటున్నారు. వైసీపీ అధినేత 2017 లో నిర్వహించిన భారీ పాదయాత్ర సమయంలో వైసీపీకి వచ్చిన హైప్ పొలిటికల్ గా హైలెట్ అయిన తీరు అందరికీ తెలిసిందే. ఆ తరువాత అంతటి పొలిటికల్ వైబ్రేషన్స్ అయితే వైసీపీకి ఎక్కడా రాలేదు. అధికారంలో ఉన్నపుడు కానీ గడచిన రెండేళ్ళ విపక్ష పాత్రలో కానీ వైసీపీ డిఫెన్స్ మోడ్ లో ఉంటోంది. చాలా సార్లు సైలెంట్ మోడ్ నే నమ్ముకుంది. ఇక అనేక సార్లు కార్నర్ అవుతూ వస్తోంది. కానీ ఇన్నేళ్ళ తరువాత మళ్లీ నాటి హైప్ వైసీపీకి క్రియేట్ అయింది అంటే దానికి వన్ అండ్ ఓన్లీ రీజన్ మావిగన్ అని అంటున్నారు. మావిగన్ అన్న మూడు అక్షరాల పదం వైసీపీని పొలిటికల్ గా ఏపీ రాజకీయ తెర మీద ఫుల్ ఫోకస్డ్ గా నిలిచేలా చేసింది అని అంటు న్నారు.ఇక దీని మీద జరిగిన చర్చ ఇంతాఅంతా కాదు అది పాజిటివ్ గా జరిగిందా లేక నెగిటివ్ గా జరిగిందా అన్నది పక్కన పెడితే వైసీపీ అన్న పేరు ప్రతీ చోటా నానేలా చేసింది.
ఆ విధంగా చూస్తే ఏప్రిల్ నెల మొదటి తేదీన వైసీపీ అధినేత జగన్ వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. ఆ రోజున ఆయన మావిగాన్ అని ప్రతిపాదించారు. అంతే నాటి నుంచి దాదాపుగా నెల రోజులుగా అదే సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది. ఎంతలా అంటే మరే టాపిక్ కూడా కనీసంగాచర్చకు నోచుకోనంతగా ఈ ఒక్క టాపిక్ తోనేవైసీపీ బహుళ ప్రచారం పొందింది.నిజంచెప్పాలంటే ఈ సమయ ంలో అంటేవైసీపీ భారీ ఓటమినిఅందుకుని విపక్షంలో ఉంటూ కేవలం 11 సీట్లతో చతికిలపడిన వేళ ఆ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు పడుతున్న వేళవచ్చిన ఈ బూస్టింగ్ కానీజరిగిన ప్రచారంకానీ రూపా యలలో లెక్క కడితే కచ్చితంగా వంద కోట్ల పై మాటే అంటున్నారు. అంటే పార్టీ ఖజానా నుంచి వంద కోట్లు తీసి పబ్లిసిటీ చేయించుకుంటే వచ్చే పబ్లిసిటీ ఫ్రీగానే వచ్చేసింది అన్న మాట. ఈ ప్రచారం అంతా మీడియానే మోసింది. భారీగా చేసింది. అది మెయిన్ స్ట్రీమ్ మీడియా నా లేక సోషల్ మీడియానా లేక డిజిటల్ ప్లాట్ ఫారం నా అన్నది పక్కన పెడితే ఒక్క మావిగన్ తో వైసీపీ అచ్చంగా ఉచిత ప్రచారాన్ని వందల కోట్ల దాకా పొందేసింది. ఇందులో జనాలదే తొంబై శాతం పాత్ర అయితే వైసీపీ నుంచి మావిగాన్ ని సమర్ధించుకుంటూ చేసిన ప్రచారం కేవలం పది శాతం మాత్రమే. అంటే ఇంతలా ఇది ప్రచారం అవుతుందని బహుశా వైసీపీ కూడా ఊహించి ఉండదు ఏది ఏమైనా వైసీపీకి ఈ సమయంలో అయితే ఇది బాగా జనంలో ఫోకస్ అయ్యేలా చేసింది మరి ఇది పాజిటివ్ గానా నెగిటివ్ గానా అన్నది పక్కన పెడితే ఒక రాజకీయ పార్టీకి కావాల్సినంత ప్రచారం అయితే దక్కింది. ఆ విధంగా వైసీపీ లక్కీ అనే అంటున్నారు.

# పొటోకాల్ రచ్చ..!...

మెదక్,**జూన్ 05 (సూర్య సేన) :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. ఇక 2014 నుంచి బీఆర్ఎస్ వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టింది. ప్రస్తుతం కారు పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి. కానీ?. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికా రంలో ఉండటంతో?.ఇక్కడ తరచూ ప్రోటోకాల్ వివాదాలు రేగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఇతర నియోజకవర్గాల్లో ఇలాంటి గొడవలు పెద్దగా లేకున్నా?.
నర్సాపూర్‌లో మాత్రం రచ్చో రచ్చస్య అన్నట్టుగా ఉంటోందట. రెండేళ్ల క్రితం అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ నియోజకవర్గంలో బడిబాట కార్యక్రమానికి వచ్చారు.అప్పుడు కాంగ్రెస్ ఇన్చార్జ్ రాజిరెడ్డికి స్కూల్ లో ఓ రూమ్‌కి రిబ్బన్ కట్‌చేసే అవకాశాన్ని మంత్రి సురేఖ ఇవ్వడాన్ని ఎమ్మెల్యే సునీత వ్యతిరేకించారు. ఎటువంటి ప్రోటోకాల్ లేని రాజిరెడ్డితో క్లాస్ రూమ్ ఎలా ఓపెనింగ్ చేయిస్తారన్నది ఎమ్మెల్యే అభ్యంతరం. ఆ సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఆ తర్వాత కూడా ప్రతి సందర్భంలో ఎక్కడో ఒకచోట ప్రోటోకాల్ రగడ నడుస్తూనే ఉంది. ఇక తాజాగా ఇన్చార్జ్ మంత్రి వివేక్ నర్సాపూర్ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం చినికి చినికి గాలి వానలా మారింది. నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్న ఎమ్మెల్యే వాదనతో రచ్చ జరిగింది. గతంలో ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశారామె. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలోనూ ప్రోటోకాల్ అంశంతో మొదలైన గొడవ చివరికి రాజకీయ విమర్శల వరకు వెళ్లింది. దీంతో ఇప్పుడు నియోజకవర్గంలోని అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలంటేనే హడలిపోతున్నారట.ఏ కార్యక్రమంలో ఏమవుతుందోనని ఆందోళన పెరుగుతోంది.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం.

**– మీర్ పేట డివిజన్ బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్**



**రంగారెడ్డి, జూన్ 05 (సూర్య సేన) :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్ రాష్ట్ర అధ్యక్షులు నారప్ప రాజు రామచంద్రరావు రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు రాజు భూపాల్ గౌడ్ ఆదేశానుసారం 12 సంవత్సరాల మోదీ ప్రభుత్వ విజయోత్సవాల సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం మీర్ పేట డివిజన్ లో భారతీయ జనతా పార్టీ మీర్ పేట అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజు నేతృత్వంలో ఏక్ పేడ్ మాకే నామ్ వృక్షారోహణ మొక్కలు నాటే కార్యక్రమం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి మహేశ్వరం అసెంబ్లీ ఇన్చార్జి అందెలశ్రీరాములు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ముఖ్య అతిథి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల ప్రభుత్వ పనితీరు పూర్తి చేసుకున్న సందర్భంగా మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ అమ్మ పేరు పైన ఒక చెట్టుని నాటాలని కోరారు. ప్రకృతి మన జీవితంలో భాగమని దానిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని ప్రతి ఒక్కరూ వీలైనప్పుడల్లా చెట్లను నాటి మన ప్రకృతిని విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస గుప్తా రాష్ట్ర నాయకులు శంకర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి జిల్లా నాయకులు మల్లారెడ్డి కార్యదర్శులు విజయ్ లక్ష్మి రాజు నీలా రవి నాయక్ ప్రశాంతి హిల్స్ అధ్యక్షులు బిక్షపతి చారి,నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు వీర కర్ణ రెడ్డి, అన్ని డివిజన్ల మాజీ అధ్యక్షులు మాజీ ప్రజాప్రతినిధులు జనరల్ సెక్రటరీలు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ నైట్ జట్టు జెర్సీ ఆవిష్కరణ




**నల్గొండ టౌన్, జూన్ 05 (సూర్య సేన) :** టీజీ20 లీగ్లో నల్గొండ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అనురాగ్ నల్గొండ నైట్స్ జట్టు జెర్సీని శుక్రవారం నల్గొండలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్లో ఘనంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన 25-30 క్రికెట్ అకాడమీల నుంచి 700 మందికి పైగా యువ క్రికెటర్లు, 60 మందికి పైగా కోచ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అనురాగ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ స్ట్రాటజీ అనురాగ్ పల్లా, గ్రామీణ ప్రాంతాల నుంచి వెలుగులోకి వస్తున్న క్రికెట్ ప్రతిభను ప్రోత్సహించేందుకు అనురాగ్ యూనివర్సిటీ దీర్ఘకాలిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులకు కోచింగ్, శిక్షణా సదుపాయాలు, ప్రాక్టీస్ మ్యాచ్లు, టాలెంట్ ఐడెంటిఫికేషన్ అవకాశాలను అందిస్తూ వారి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సీజన్ కే పరిమితం కాని, రాబోయే ఐదేళ్లపాటు కొనసాగనున్న దీర్ఘకాలిక కార్యక్రమం అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో టాలెంట్ హంట్లు, ఇంటర్ అకాడమీ టోర్నమెంట్ల నిర్వహణపై కోచ్లు, విద్యార్థులు చేసిన సూచనలను స్వాగతిస్తూ వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనురాగ్ నల్గొండ నైట్స్ హెడ్ కోచ్ డి.బి. రవితేజ యువ ఆటగాళ్లతో ప్రత్యేకంగా మమేకమై ఫిట్నెస్, నైపుణ్యాల అభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ఆటలో నిరంతర మెరుగుదల వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫిట్నెస్ సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఆటగాళ్లను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జట్టు అసిస్టెంట్ కోచ్ రోనాల్డ్ రోడ్రిగ్స్, ఫిజియో, ట్రైనర్, మేనేజర్, మెంటర్ తదితర సపోర్ట్ స్టాఫ్ ను పరిచయం చేశారు. అనంతరం అనురాగ్ నల్గొండ నైట్స్ అధికారిక జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా అనురాగ్ యూనివర్సిటీ మరియు ప్రాంతీయ క్రికెట్ వర్గాల మధ్య బలమైన భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టబడింది. యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ ప్రాంతీయ క్రికెట్ అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలకంగా నిలవనుంది. అని అన్నారు

## నిదానమే ప్రధానం! నిజానికి నినాదం కాదు! జీవన విధానం!

**– హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి, డాక్టర్, ఏ.ఎస్. శ్రీనివాస్**

**రంగారెడ్డి, జూన్ 05 (సూర్య సేన) :** వాహనాల వెనుక కనబడే "నిదానమే ప్రధానం" నిజానికి నినాదం కాదు అది ఒక జీవన విధానం, అని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఏ.ఎస్. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ వాహనాలు నడపడం లోనే కాదు జీవితాన్ని గడపడంలోనూ పాటించవలసిన మంచి సూత్రం ఇది అన్నారు. అవసరంలేని సమయాల్లో తొందరపడడం తొందరపడవలసిన సందర్భాలలో నిదానం చాలా అవసరం కానీ పనులను తలపెడుతున్నప్పుడు, ఒక దుష్టాంతం వివరించారు. పరుగు పరుగున వచ్చాడు శిష్యుడు, గురువర్యా మీకీ సంగతి తెలిసిందా అంటూ ఎవరి మీదనో ఫిర్యాదు చేయబోయాడు, ఆపాడు శిష్యుడు, గురువు ముందు నా ప్రశ్నలకు జవాబు చెప్పు నువ్వు విన్నదంతా నిజమేనని స్వయంగా తెలుసుకున్నావా? చెప్పబోయే విషయం మంచిదేనా దాన్ని చర్చించడం వల్ల మేలు ఏదైనా ఉందా అని ప్రశ్నించాడు .

శిష్యుడు తెల్లబోయాడు. చెప్పుడు మాటలు ప్రచారంలో నువ్వు సామాజిక మాధ్యమాలను కంటబడిందల్లా ముందు వెనక ఆలోచించకుండా అందరికీ పంచడంలోనూ మనలో చాలామందిని అలాగే ఆత్రపడతామని, వినదగునెవ్వరు చెప్పిన అనే ఊరుకోలేదుగా అన్నారు.

లి పాలనలో నెమ్మది పనికిరాదు

శృంగార నైషధం లో నలుడికి చెలులు మేలుకొలుపులు పాడినట్లు ఇంటింటా అమ్మలు రాగాలు తీస్తుంటే పిల్లలు ఎక్కడ లేని నిదానం పాటిస్తారు. కార్యాలయ దస్త్రాల పరిశీలనలో అత్యవసర పనుల నిర్వహణలో చాలామంది అతి నెమ్మదిగా వ్యవహరిస్తారు. అది నిదానం కాదు సోమరితనం అందుకే అలసత్వం మనకు తెలియని శత్రువు అని అన్నారు. ఆపదలో ఆదుకునే ఆప్త మిత్రుడు తిరుమల శ్రీవారి సమక్షంలో సేవకులు నెట్టివేస్తూ ఉంటే నెమ్మదిగా కదిలే ప్రయత్నం చేస్తాం,అదే నిదానం తత్వంగా జీవన సూత్రంగా అలవాటుగా మారాలంటే నీతో నే యుద్ధాన్ని ఆపివేయాలి. బిర బిర చరచర పరుగున పరుగున ఉరకలు వేయాలి అని మనసును అదిరించడం మానేయాలి.



తొందర పెట్టడం మానేస్తే నిశ్శబ్దమైన మనసులోంచి నిస్సహాయమైన అరుపులు మనకు వినిపిస్తాయి అన్నారు. సమాజం నీతో చదివించే రాత ప్రతికి బదులుగా నీ ఆలోచనలోనే నువ్వు చదవడం మొదలై ఆ అరుపులు ఆగిపోతాయి. ఆ లో చూపే మనపై గెలుపు. నిదానమే ప్రధానం అన్నది ఒక జీవన విధానం అవుతుంది. మనసుపై శరీరంపై మంచి ప్రభావాన్ని చూపిస్తుంది . గ్రీస్ లోనిద్వీపవాసులు ఇప్పటికీ దొరికింది కూడా వారు దేనికి హడావుడి పడరని ఒత్తిడికి లోన్ కారని "సిగ సిగ" అనేది వారి సిద్ధాంతమని మెల్లమెల్లగా అని దాని అర్థం అన్నారు. అందుకే చావు కూడా నిదానంగానే సమీపిస్తుందని వారిని ఎంత అంటే మరణించడం మరిచిపోయిన ద్వీపంగా లోకం విస్తుపోయేంతగా ఎప్పుడు తెల్లవారుతుందా అని పొడి కళ్ళతో ఎదురు చూడరు అప్పుడే తెల్లారిందా అనిపించే మెలకువ అక్కడి వారిది మాటలో మనసులో మనుగడలో తిండిలో తిరుగుడులో అన్నింటా తొందరతొందర పడే మనకు వేగం వేగం రాద్ధాంతమే తప్ప సిగాసిగా సిద్ధాంతం వంట పట్టడం అంత సులువేమీ కాదు.

అదే అసలు సమస్య అని కార్యాలయాల నిర్వహణ, ( ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ కార్యాలయాలు) లలో నిస్సత్తువతో, నిదానంగా పనిచేయడం, నిదానమే ప్రధానం అనే సూత్రం ఇక్కడ వర్తించదు. పని నిదానంగా చేస్తే ప్రజలకు సేవలు అందించలేము, పని వేగం పెంచాలి తప్ప, పరుగులు పెట్టడం కాదు అని ముగించారు.

## రేపు గాన గంధర్వనికి బాల గంధర్వుల స్వరార్చన.




**– నిర్వహణ, లిటిల్ మ్యూజీషియన్ అకాడమీ వ్యవస్థాపకులు, ప్రముఖ సంగీత దర్శకులు గాయకులు డాక్టర్ కోమందూరి రామాచారి**

**– శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు, గొర్తి చంద్రశేఖర్**

**రంగారెడ్డి, జూన్ 05 (సూర్య సేన) :** గాన గంధర్వులు డాక్టర్ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 80వ జయంతిని పురస్కరించుకొని,

లిటిల్ మూజీషయన్ అకాడమీ ( బాల గాంధర్వం) వ్యవస్థాపకులు ప్రముఖ సంగీతదర్శకులు గాయకులు డాక్టర్ కోమందూరి రామాచారి శిష్య బృందం 80 మంది నేపథ్య యువ గాయని గాయకులచే ఈనెల 7వ తేదీ ఆదివారం, మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఖైరతాబాద్ క్రాస్ రోడ్ లోని దిఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ( ఇండియా ఆడిటోరియం) లో, డాక్టర్ పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం స్వరార్చన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి, భారీ ఎత్తున, అమర గాయకుడు గాన గంధర్వులు ఎస్పీ బాలసుబ్రమణ్యం అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గొర్తి చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి, గౌరవ అతిథులుగా ఎండి డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అంబుషడర్ జి ఆర్ సూర్య రాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



పొనుగోటి శ్రీనివాసరావు, శ్రీ భువి ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎం డి వర్కాల వెంకటేష్ గౌడ్, సాయి రుక్మిణి కన్స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎండి కొమ్మజు చక్రపాణి, కళాబంధు రాజేష్ ప్రభు, కార్యక్రమం ముఖ్య సలహాదారులు (గోపికృష్ణ ) కాంద్రేగుల కృష్ణారావు దంపతులు, హాజరవుతారని కార్యక్రమ వ్యాఖ్యలుగా గానకళాకౌస్తుభ, శ్రీమతి ఎన్ లలిత, అక్కిరాజు యోగిత ప్రభంజన్, హాజరవుతారని కార్యక్రమాన్ని రవికుమార్ సమన్వయం చేస్తారని ఎల్లలు లేనిది బేధాలు తెలియనిది ప్రజలందరికీ చేరువయ్యేది కళ,అని ఆకళను రానున్న తరాల వారికి, అందించే విధంగా స్వర్గీయ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత తెలంగాణ సాహిత్యానికి స్ఫూర్తి, డాక్టర్ సి నారాయణ రెడ్డి, తెలంగాణ ఉద్యమ కవి తెలంగాణ గానానికి స్ఫూర్తి, డాక్టర్ దాశరధి కృష్ణమాచార్య దివ్య ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గొర్తి చంద్రశేఖర్ కోరారు.

## రాష్ట్రంలో భూములు రేట్లమార్కెట్ విలువ హేతుబద్ధీకరణను ఉపసంహరించుకోవాలి...

**– భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శూరకర్ణ రెడ్డి**

రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 05 (సూర్య సేన): రాష్ట్రంలో భూములు




ప్లాట్ల మార్కెట్ విలువ హేతుబద్దీకరణకు ప్రభుత్వం ముందడుగు వేయడం దురదృష్టకరమని ఇది సామాన్యుడి పై అదనపు భారం మోపడమేనని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శూర కరుణారెడ్డి విమర్శించారు. శుక్రవారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మార్కెట్ విలువ పెంపు పేరుతో ఇప్పటికే దరాలు అవకాశాన్ని అంటే ఆయనే ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలు పెంచుతుందని సమాచారంతోనే రిజిస్ట్రేషన్లకు జనం ఎగబడుతున్నారని పెరిగిన ధరల ప్రకారం చార్జీలు కడితే అదనపు వారం పడుతుందని భయంతో నిరాఖరులోపే ప్రక్రియ పూర్తి చేసుకుంటున్నారని ఇది సామాన్య కొనుగోలుదారిని జేబుకు చిల్లు పెట్టడమే అని అన్నారు.

**– ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ముందు చార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు అభివృద్ధి పేరుతో అన్ని రకాల ఫీజులు పెంచడం సరికాదని ప్రజలు మండిపడుతున్నారని అన్నారు. మాట తప్పినప్పుడు నమ్మకం పోతుందని కార్యాలయాల్లో అవస్థలు పడుతున్నారని ఒక్క రిజిస్ట్రేషన్ కోసం మూడు రోజులు తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని. సర్వర్ డౌన్ సిబ్బంది లేకపోవడం సేవను సరిగా ఇవ్వకుండా చార్జీలు మాత్రం పెంచడం అన్యాయమని ఇది హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పై పెద్ద దెబ్బ అని మార్కెట్ రేట్లు పెరిగితే సామాన్యుడు చస్తాడు అనే చెక్ చెయ్ ఇప్పటికే నడుస్తోందని రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరిగితే మధ్యతరగతి కుటుంబాల సొంత ఇంటి కలలు వదులుకోవాల్సిందేనని అన్నారు. తక్షణమే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని కొత్త మార్కెట్ విలువలు చార్జీల పెంపును నిలిపివేసి పాత రేట్లతోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు, దీనిపై పారదర్శక చర్చ జరగాలని భూమి విలువ సవరణ చార్జీల సవరణకు ముందు రైతులు కొనుగోలుదారులు బిల్డర్లతో సమావేశాలు పెట్టి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు సేవలు మెరుగుపరిచిన తర్వాతనే ఫీజుల పెంపు ఆలోచన చేయాలని స్లాట్ బుకింగ్ సర్వర్ సమస్యలు సిబ్బంది కొరత తీర్చి ఒక్క రోజులు రిజిస్ట్రేషన్ అయ్యేలా చేసిన తర్వాతే చార్జీల సంగతి చూడాలని సూచించారు. ఇంటికాడ తీరాలంటే రిజిస్ట్రేషన్ భారం తగ్గాలని పెంచిన చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పడిదల వెంకన్నను పరామర్శించిన ఎఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట టౌన్, జూన్ 05 (సూర్య సేన): పట్టణంలోని శ్రీ విజయకృష్ణ హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న 3వ వార్డు బిబిగుడెం కు చెందిన పడిదల వెంకన్న ని పరామర్శించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆయన వెంట 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు పడిదల రవి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొగదాల లక్ష్మణ్ గౌడ్, నాగు నాయక్, మల్లెపాక అనిల్, శాంతయ్య, తదితరులు ఉన్నారు.

## అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.....

**– నవతెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్ణ గంటి రంజిత్ కుమార్**

**రంగారెడ్డి, జూన్ 05 (సూర్య సేన) :** ప్రైవేట్ విద్యాసంస్థలను అక్రమంగా నిర్వహిస్తున్న అడ్మిషన్లను, అడ్డుకోవాలని అధిక డొనేషన్లు ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుని సీజ్ చేయాలని, నవతెలంగాణ రాష్ట్ర విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్ణ గంటి రంజిత్ కోరారు. రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ప్రైవేటు కళాశాలను పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫామ్ లను బలవంతంగా విక్రయించే



విధానాన్ని నిషేధించాలని ప్రతి ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించే డిసిప్లే బోర్డులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు పారదర్శకత జవాబుదారితనం పెంపొందించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణతోనే భవిష్యత్ భద్రం

హుజూర్నగర్ ప్రతినిధి, జూన్ 05 (సూర్య సేన): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హుజూర్నగర్ టౌన్వనంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న



డాక్టర్ అందే సత్యం మాట్లాడుతూ ప్రకృతి ప్రజల ప్రాణాధారమని అన్నారు.

ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే భూతాపం పెరిగి ప్రాణికోటికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన బాదే నరసయ్య మాట్లాడుతూ పారిశ్రామిక కాలుష్యంతో పంటలు, భూగర్భ జలాలు ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ కళాకారుడు ధర్మోరు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించకపోతే భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దొంతగాని సత్యనారాయణ, నాగేశ్వరరావు, వీరస్వామి, రత్నకుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌కు... సుఖోయ్-57

**న్యూఢిల్లీ, జూన్, 5 (సూర్యసేన ప్రతినిధి):** రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ రక్షణపరంగా మరోమారు భారతదేశానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. రష్యాకు చెందిన అత్యంత అధునాతన ఐదోతరం జెట్ యుద్ధ విమానం స్టెల్త్ సుఖోయ్ సూ 57 భారత్‌కు అందించేందుకు పుతిన్ ముందుకు వచ్చారు. భారత దేశం ఇప్పుడు తమ వైమానిక దళం బలోపేతానికి ఐదో తరం ఫైటర్ల కోసం యత్నిస్తోంది. ఈ దశలోనే భారత్‌కు మిత్రదేశం అయిన రష్యా అధినేత నుంచి ఈ



కీలక ప్రతిపాదని వెలువడింది. భారత్‌కు కేవలం ఈ యుద్ధ విమానాలు అందించడమే కాకుండా , భారత్‌తో కలిసి సంయుక్తంగా వీటిని రూపొందించేందుకు కూడా సిద్ధం అని పుతిన్ తెలిపారు.

## సంపాదకీయం

శనివారం, జూన్ 6, 2026

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయింపులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్ధరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెక్కుతారు. నదీ జలాలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.


సూర్యసేన

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


## ఇదేలే తరతరాల చరితం...




# తరాలు మారినా.. తరుగని స్నేహ బంధం..

## భక్త రామదాసు, తానీషా వంశాల వారసులు కలిసిన శుభ తరుణం..



శతాబ్దాలు గడిచినా కంచెర్ల అనే పదం వినిపించగానే తెలుగువారి మదిలో స్ఫురించే పేరు కంచెర్ల గోపన్న ఎన్నో వ్యయ ప్రయాసలను ఎదుర్కొని, అత్యంత భక్తి శ్రద్ధలతో భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని నిర్మించి శ్రీ భక్త రామదాసు గా చరిత్ర పుటల్లో నిలిచిన మహోన్నత వ్యక్తి శ్రీ కంచెర్ల గోపన్న గారు.

వీరి వంశానికి చెందిన పదకొండవ తరం వారసులే శ్రీ కంచెర్ల వెంకట రమణ గారు శ్రీ వెంకట రమణ గారు వారి తాతగారైన రామదాసు గారి పరంపరలో శ్రీరామ భక్తుడిగా , హనుమత్ ఉపాసకుడిగా, ఆధ్యాత్మిక ఢ సామాజిక వేత్తగా, సనాతన ధర్మ ప్రచారకుడిగా వివిధ కార్యక్రమాలలో పాల్గొంటూ అందరి ఆదరాభిమానాలను చూరగొన్నారు.

కుతుబ్ షాహి వంశానికి చెందిన అబుల్ హసన్ తానీషా గారు గోల్కొండ పాలకుడిగా,సుపరిచితులే !

శ్రీ భక్త రామదాసు గారు, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని ప్రభుత్వ ధనంతో నిర్మించారనే సందేహంతో, వారిని బంధించి కఠినంగా శిక్షించడం , ఆ తరువాత సాక్షాత్తు శ్రీ రామలక్ష్మణులే రామదాసు గారి భక్తికి మెచ్చి , రామోజీ లక్ష్మోజీ గా వచ్చి బంగారు (రామ టెంకి) కాసులను చెల్లించి వారిని బంధ విముక్తులను చేయించడం, రామలక్ష్మణుల దర్శనంతో తానీషా గారికి కూడా శ్రీరాముడి పై అపారమైన భక్తి కలగడం మనందరికి తెలిసిన విషయమే !

ఆ తానీషా గారి ముని మనుమడే... రౌనత్ యార్ ఖాన్, వీరు ప్రముఖ వ్యాపారవేత్త అయినప్పటికి, వారి తాతగారైన తానీషాగారి వలె రామభక్తి కలిగి ఉండడం , ఆధ్యాత్మిక భావంతో, రామాయణంను ప్రతి సంవత్సరం వినడం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక మరియు సామాజిక సేవలు అందించే వారి కోసం ప్రజ్ఞా భారతి అనే సంస్థను 1991 లో హైదరాబాద్ లో స్థాపించారు. ఈ సంస్థకు రౌనత్ యార్ ఖాన్ కూడా ఒక దర్శకుడిగా పని చేసారు. శ్రీ కంచెర్ల వెంకటరమణ గారు ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు గుర్తింపుగా ప్రజ్ఞాభారతి పురస్కారం 2017వ సం॥లో రౌనత్ యార్ ఖాన్ గారి చేతుల మీదుగా తీసుకోవడం విశేషం. వీరితో పాటుగా ముదిగొండ శివప్రసాద్ గారికి కూడా అవార్డ్ లభించింది. ఈ విషయం ఈనాడు దిన పత్రికలో ప్రచురింపబడినది. ఈ మధ్యలో గౌ॥ రౌనత్ యార్ ఖాన్ గారి ఆహ్వానం మేరకు శ్రీ కంచెర్ల వెంకట రమణగారు వారిని కలిసారు. భద్రాచలం స్వామి వారి తలంబ్రాలు ఖాన్ గారికి అందించారు. వీరు ఇరువురు పరస్పరం సన్మానించుకున్నారు.

"శతాబ్దాలు గడిచినప్పటికి, వీరి ఆత్మీయ కలయిక ఎందరికో స్ఫూర్తి.. వీరి పూర్వీకుల ఘన చరిత మరువదు తెలుగు జాతి.."

**శ్రీరామ రక్ష... సర్వ జగద్రక్ష**

# అసంపూర్ణ స్వప్నాలు... అక్షర సత్యాలు!

1789వ సంవత్సరం పారిస్ వీధులు నిప్పుల కొలిమిలా మారాయి. శతాబ్దాల అణచివేతపై సామాన్యుడు తిరగబడిన వేళ, మానవ ఇతిహాసంలోనే అత్యంత శక్తివంతమైన మూడు పదాలు ఆ మంటల నుండి ఉద్భవించాయి. అవే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం (ాఱఎవతీం, జునఋఙశ్రీఱ్‌ఎ, ఖీతీఫ్‌వతీఅఱ్‌ఎ). ఫ్రెంచ్ విప్లవం రగిలించిన ఈ త్రివర్ణ జ్వాల కాల గమనంలో సరిహద్దులు దాటి ప్రపంచమంతా వ్యాపించింది. భారత రాజ్యాంగ శిల్పి, మేధో శిఖరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఈ మూడు విలువలను కేవలం రాజకీయ సూత్రాలుగా చూడలేదు, తన జీవిత ఆశయంగా, శ్వాసగా స్వీకరించారు. ఈ మూడింటిలో ఏ ఒక్కటి లోపించినా, సమాజ శకటం కుంటుపడుతుంది అని ఆయన నాడే హెచ్చరించారు. కానీ, ఆధునికత వైపు అడుగులు వేస్తున్న నేటి భారతదేశంలో, అలాగే ప్రపంచ యవనికపై, ఈ ముగింపు లేని మూడు కలలు నిజంగా సాకారమయ్యాయా? లేదా కాలగర్భంలో కలిసిపోతున్న అక్షర సత్యాలుగా మిగిలిపోయాయా? ఈ అక్షర ప్రయాణంలో వాస్తవాలను ఒకసారి విశ్లేషించుకుందాం.స్వేచ్ఛ అంటే ఏమిటి? బ్రిటీష్ పాలన నుండి విముక్తి పొంది, కోటలపై జాతీయ జెండాను ఎగురవేయడమేనా? కచ్చితంగా కాదు. నిజమైన స్వేచ్ఛ అంటే ప్రతి పౌరుడూ భయం అనే సంకెళ్లు లేకుండా మాట్లాడగలగడం, ఆలోచించగలగడం, పాలకులను ప్రశ్నించగలగడం. కానీ నేడు మన చుట్టూ ఉన్న సామాజిక వాస్తవాలను గమనిస్తే గుండె తరుక్కుపోతుంది. సత్యాన్ని నిర్భయంగా సమాజం ముందుంచే ఒక పాత్రికేయుడు జైలు గోడల మధ్య బందీ అవుతున్నాడు. తన మట్టిని, పొలాన్ని కాపాడుకోవాలని గొంతెత్తిన ఒక శ్రమజీవి, రైతు లాఠీ దెబ్బలకు బలవుతున్నాడు. అర్ధరాత్రి వేళ ఒక స్త్రీ ఒంటరిగా, నిశ్చింతగా నడవలేని భయానక వాతావరణం నేటికీ కొనసాగుతోంది. మరి దీనిని మనం సంపూర్ణ స్వేచ్ఛ అని ఎలా పిలవగలం?

సాంకేతికత పెరిగిన డిజిటల్ యుగంలో మన స్వేచ్ఛకు సరికొత్త గ్రహణం పట్టింది. అదే నిఘా సంస్కృతి . మనం మాట్లాడే ప్రతి ఫోన్ కాల్, మనం పంపే ప్రతి సందేశం ఎవరో మూడో వ్యక్తి గమనిస్తున్నారనే అభద్రతాభావం పౌరుల మనసుల్లో నాటుకుపోయింది. దీనివల్ల సమాజంలో స్వీయ నియంత్రణ (ావశ్రీట-ఛవఅంశీతీంష్ట్రఱజూ) అనే ప్రమాదకరమైన శత్రువు పుట్టుకొచ్చింది. ఇది బయటి వ్యక్తులు వేసిన సంకెళ్లు కాదు, సమాజానికి భయపడి మన మనస్సాక్షికి మనమే వేసుకుంటున్న సంకెళ్లు. ఆలోచనలకే తాళం పడితే, ఇక స్వేచ్ఛకు అర్థం ఎక్కడుంది?రాజ్యాంగ పీఠిక ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే,

అందరికీ సమాన అవకాశాలు ఉంటాయి. వినడానికి ఎంత బాగుందో కదా! కానీ సమాజంలోకి అడుగుపెడితే కఠిన వాస్తవాలు వెక్కిరిస్తాయి. పుట్టిన కులం, మతం ఆధారంగానే ఒక వ్యక్తి జీవితావకాశాలు, సామాజిక గౌరవం నేటికీ నిర్ణయించబడుతున్నాయి. ఒక సంపన్నుడి బిడ్డ అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ విద్యను పొందుతుంటే, ఒక పేదవాని బిడ్డ కనీస వసతులు లేక మధ్యాహ్న భోజనంతోనే సరిపెట్టుకుని, ఆర్థిక భారంతో చదువును మధ్యలోనే ఆపేస్తున్నాడు. చట్టం, న్యాయం అందరికీ ఒకేలా వర్తించాలనేది నియమం. కానీ, కోర్టులలో న్యాయం కూడా ఒక ఖరీదైన సరుకుగా మారిపోతోందని అందరికీ తెలిసినా, ఎవరూ బాహాటంగా చెప్పలేని నిస్సహాయ స్థితి నెలకొంది.ఆర్థిక అసమానతలు ఏ కాలంలోనూ లేనంతగా నేడు పెరిగిపోయాయి. ఒకవైపు దేశంలో బిలియనీర్ల సంఖ్య, వారి విలాసవంతమైన భవనాలు పెరుగుతుంటే, మరోవైపు ఆకలితో, పౌష్టికాహార లోపంతో అలమటిస్తున్న పసిపిల్లల వార్తలు మన దినపత్రికల ముఖచిత్రాలుగా మారుతున్నాయి. లింగ సమానత్వం విషయంలోనూ మనం ఇంకా సగం దూరంలోనే ఆగిపోయాం. చట్టసభలలో మహిళా ప్రాతినిధ్యం గురించి దశాబ్దాలుగా మాట్లాడుకుంటున్నా, అది ఆశించిన స్థాయిలో పెరగలేదు. సమాన పనికి సమాన వేతనం లేకపోవడం, గృహహింస, నాగరిక సమాజం సిగ్గుతో తలదించుకునే వరకట్న మరణాలు ఇవన్నీ మనం సమానత్వాన్ని సాధించామని చాటిచెప్పే సంకేతాలా?సౌభ్రాతృత్వం అంటే సోదరభావం. కులమతాలకు అతీతంగా అందరినీ తోడబుట్టినవారిలా భావించే ఒక ఉన్నతమైన మానసిక స్థితి. కానీ నేడు దురదృష్టవశాత్తూ మనం కులాల పేరిట, మతాల పేరిట, ప్రాంతాల పేరిట చీలిపోతున్నాం. సమాజంలో సామరస్యాన్ని పెంచాల్సిన సామాజిక మాధ్యమాలు (ాశీఛఱశ్రీ వీవఱఱ) నేడు ద్వేషాన్ని, అసహనాన్ని ముక్కలు ముక్కలుగా విరజిమ్మే వేదికలుగా మారాయి. ప్రతి చిన్న విషయానికి మన వాళ్ళు వాళ్ళ వాళ్ళు అన్న గోడలు రోజురోజుకూ ఎత్తుగా పెరుగుతున్నాయి.ఒక మసీదు పక్కన హిందూ దేవాలయం, ఒక చర్చి పక్కన గురుద్వారా ప్రశాంతంగా వెలిసినప్పుడే ఆ సామరస్యంలో నిజమైన సౌభ్రాతృత్వం కనిపిస్తుంది. కానీ ఆ సున్నితమైన మానవ సంబంధాలను రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం కొందరు స్వార్థపరులు ధ్వంసం చేస్తున్నారు. వీటన్నింటికీ తోడు, పేదరికం సౌభ్రాతృత్వానికి అతిపెద్ద శత్రువుగా మారింది. ఆకలితో కడుపు కాలుతున్న వ్యక్తికి మతసామరస్యం గురించి, దేశభక్తి గురించి సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వడం శుద్ధ దండగ. ఆకలితో ఉన్నవాడికి మొదటి ముద్ద పెట్టి ఆదరించిన వ్యక్తినే అతడు చివరి శ్వాస దాకా తన సోదరుడిగా భావిస్తాడు అదే ప్రకృతి నేర్పే నిజమైన సౌభ్రాతృత్వం!చరిత్ర వైపు ఒకసారి లుక్కేస్తే నెల్సన్ మండేలా తన జీవితంలోని అత్యంత విలువైన 27 సంవత్సరాలను చీకటి జైలు గదిలోనే గడిపారు కేవలం స్వేచ్ఛ కోసం! మహాత్మా గాంధీ సౌభ్రాతృత్వాన్ని, అహింసను తన ఆచరణ ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారు. అంబేద్కర్ తన మేధస్సును, జీవితాన్ని సమానత్వ స్థాపన కోసం అంకితం చేశారు. మహానుభావుల కలలు ఇంకా పూర్తిగా నిజం కాలేదనేది వాస్తవమే, కానీ ఆ విలువలను సాధించడానికి సాగుతున్న అంతర్గత పోరాటం ఆగలేదు ఆగకూడదు కూడా.సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూసి నిరాశ పడటం చాలా సులభం. ఈ దేశం ఇంతే... ఏమీ మారదు అని చేతులు ముడుచుకుని కూర్చోవడం మరింత సులభం. కానీ చరిత్ర మనకు నేర్పిన సత్యం ఏమిటంటే మార్పు ఎప్పుడూ ఒకేసారి రాదు, అది ఏదో ఒక చిన్న మూల నుంచే మొలకెత్తుతుంది.ఒక గ్రామీణ పాఠశాల ఉపాధ్యాయుడు పిల్లలకు కులమతాల అతీతంగా రాజ్యాంగ విలువలను నేర్పించినప్పుడు మార్పు మొదలవుతుంది.ఒక న్యాయవాది



రూపాయి ఆశించకుండా పేదల తరపున కోర్టులో వాదించినప్పుడు న్యాయంపై నమ్మకం చిగురిస్తుంది.ఒక వైద్యుడు రాత్రిపూట కొండకోనలు దాటి గిరిజన గ్రామానికి వెళ్ళి వైద్యం అందించినప్పుడు మానవత్వం పరిమళిస్తుంది.నేటి యువతరంపై మనకు గట్టి నమ్మకం ఉంది. వారు అన్యాయాలను చూసి ఊరికే కూర్చోవడం లేదు, సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకుని డిజిటల్ వేదికలపై గొంతెత్తుతున్నారు. సమాచార హక్కు చట్టం (=×) ద్వారా అవినీతిని బట్టబయలు చేస్తున్నారు. కళలు, సాహిత్యం, వీధి నాటకాలు, సంగీతం ద్వారా సమాజంలో చైతన్యాన్ని రగిలిస్తున్నారు. ఈ తిరుగుబాటు స్వరాలు వినిపిస్తున్నంత కాలం, రాజ్యాంగ నిర్మాతలు కన్న ఆ కలలు సజీవంగానే ఉంటాయి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఇవి ఒక్కసారి సాధించి షోకేస్‌లో పెట్టుకునే ట్రోఫీలు కావు. ఇవి ప్రతి రోజూ, ప్రతి క్షణమూ పౌరులుగా మనం కాపాడుకోవాల్సిన అమూల్యమైన జీవన విలువలు. ఒక తరం ఎన్నో త్యాగాలు చేసి సాధించిన స్వేచ్ఛను, తదుపరి తరం తన నిర్లక్ష్యంతో, బాధ్యతారాహిత్యంతో కోల్పోతుంది అనేది చరిత్ర మనకు ఇస్తున్న పదునైన హెచ్చరిక.ఈ వ్యాసం చదువుతున్న మిత్రులారా! ఈ కల కేవలం మీ ఒక్కరిదే కాదు. ఈ దేశంలోని కోట్లాది మంది సామాన్య ప్రజల గుండెల్లో నలుగుతున్న నిశిత స్వప్నం ఇది. ఆ కలను నిజం చేసే అద్భుతమైన శక్తి, బాధ్యత మీలోనే ఉన్నాయి. మీరు సరైన వ్యక్తికి ఓటు వేసినప్పుడు, మీ పిల్లలకు నైతిక విలువలను నేర్పినప్పుడు, సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని చూసి ప్రశ్నించినప్పుడు మీరు ఆ మహానుభావుల కలను నిజం చేయడానికి ఒక్క అడుగు ముందుకు వేస్తున్నారని మరువకండి. మనం అందరం కలిసి ఒక్కో అడుగు ముందుకు వేస్తే, సమసమాజ స్థాపన అనే గమ్యానికి మార్గం తానే సుగమం అవుతుంది!


డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.....





**నల్గొండ టౌన్, జూన్ 05 (సూర్య సేన) :** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్గొండ లోని గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు. గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అద్దాలు, ఎలక్ట్రికల్ వైరింగ్, విండోలు, వాటర్ ట్యాంకులు, నీటి ట్యాపులు, లైటింగ్, తలుపులు, బాత్రూములు, టాయిలెట్లు, కిచెన్ గదులు, తదితర పనులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే గృహ సముదాయం మొత్తాన్ని శుభ్రపరచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని , జిమ్, పార్కులు, బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, జిరాక్స్ సెంటర్, మీ సేవా కేంద్రం, మెడికల్ షాప్, కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ ఆదేశించారు. అదేవిధంగా లే అవుట్ బోర్డులు, దిశా నిర్దేశిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గృహ సముదాయం పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, వైకుంఠధామం, క్రీడా మైదానం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, నివాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లా గృహ నిర్మాణ పీడి రాజ్ కుమార్ ,పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, కాంట్రాక్టర్ సైదిరెడ్డి, సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు

# గరిడేపల్లి మండలానికి 10 పూర్వ ప్రాథమిక పాఠశాలలు మంజూరు

**గరిడేపల్లి ప్రతినిధి, జూన్ 05 (సూర్య సేన) :** రాష్ట్ర ప్రభుత్వం సూర్యాపేట జిల్లాలో 91 ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేయగా, గరిడేపల్లి మండలంలోని 10 పాఠశాలలు ఎంపికైనట్లు మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్ తెలిపారు.

గరిడేపల్లి, గుండాలమిట్ట, కల్మల్‌చెరువు, గానుగబండ, సర్వారం, తాళ్లమల్కాపురం, వెలిదండ, రాయినిగూడెం, కీతవారిగూడెం, పొనుగోడు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించనున్నారు.

ప్రతి పాఠశాలకు ఒక బోధకుడు, ఒక ఆయాను నియమించనున్నట్లు తెలిపారు. బోధకుల పోస్టుకు ఇంటర్మీడియట్‌తో పాటు చిన్నారుల విద్యా శిక్షణ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనుండగా, ఆయా పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణత కనీస అర్హతగా నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన బోధకులకు నెలకు రూ.8 వేలు, ఆయాలకు రూ.6 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

# జీవన రాగం......

మనిషి కోరికల పుట్ట
ఉన్నత జీవితం కోసం
ఉవిళ్ళు ఊరుతాడు
ఆశయాల సాధనకు
ఆరాటపడతాడు

ఇతరులతో పోల్చుకొని
ఆర్థికంగా ఎదగడానికి
పోటీ పడతాడు
అడ్డదారుల్లో అధికారాన్ని
చెలాయిస్తాడు

మోసం కుట్రలతో
మాయ మాటలతో
మనుషులను
వంచిస్తాడు

నిరాశ నిస్పృహల్లో జీవిస్తూ
చీకటిని చేధించి జీవితాన్ని
ఉన్నతంగా మార్చుకోవడానికి
ప్రయత్నిస్తాడు

నేటి ఓటమి రేపటి గెలుపుకు
పునాది అనే ఆశతో ఆగిపోకుండా
ముందుకు సాగుతాడు

కదిలే కాలంతో పాటు కదులుతూ
కష్టాల కడలినిదాటి సుఖాల
బాటలో పయనించాలని
తాపత్రయపడతాడు

గతంలో జరిగిన తప్పుల
నుండి పాఠాన్ని నేర్చుకోవాలి
వర్తమానంలో జీవించి
జీవితాన్ని ఉన్నతంగా
మలుచుకోవాలి

ప్రగతిశీల ఆలోచనలతో
ముందడుగు వేయాలి

లక్ష్య సాధనకు నిరంతరం
ముందుకు సాగడమే
నీ గమ్యమై ఉండాలి
ఆలస్యాన్ని వీడి శ్రమను
తోడు చేసుకోవాలి

నమ్మకమే పెట్టుబడిగా
నాణ్యమైన జీవితాన్ని గడపాలి
సమస్య పరిష్కారసామర్థ్యాన్ని
పెంచుకోవాలి

నీ శక్తిని మాటల్లో కాదు
చేతుల్లో చూపించు
అప్పుడు మారుతుంది
నీ జీవితపు తీరు

మనుషులను ప్రేమిస్తూ
పరోపకారమే ధ్యేయంగా
సహనమే జీవన రాగంగా
మానవీయతే మార్గంగా
విజయం సాధన కాంక్షతో
ముందుకు సాగాలి

కోరిన వారికి సహాయం చేస్తూ
నమ్మకమే ఆయుధంగా
సంతృప్తితో బతకడమే
అసలైన జీవితం

నిరంతర శ్రమతో
నీ భవితవ్యాన్ని మార్చుకో
నిందలను మోస్తూ పొగడ్తలకు
పొంగిపోయి గమ్యాన్ని మరువకు
విమర్శలను నీఎదుగుదలకు
సాధనంగా మార్చుకో

సమయపాలన సంకల్పశక్తి
కార్యసాధన క్రియాశీలతే
నీతోడుంటే ఉన్నత స్థానం
చేరుకుంటావు

ధనం కన్న వ్యక్తిత్వం మిన్న
వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటే
జీవితం ఆదర్శమౌతుంది
నీతి నిజాయితీ నీ జీవన రీతి
అవుతే చరిత్రలో చిరస్మరణీయ
స్థానంలో నిలిచిపోతావు
భావి తరాలకు స్ఫూర్తిదాతవై
మిగిలిన పోతావు



**నేదునూరి కనకయ్య**
**రచయిత కాలమిస్ట్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**కరీంనగర్**
**9440245771**

# పోలీసుల అరెస్టు దాడిలో అస్వస్థతకు గురైన వట్టే జానయ్య యాదవ్, ఏరియా ఆసుపత్రికి.... అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలింపు

**భానుపురి, జూన్ 05 (సూర్య సేన) :** సూర్యాపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత అక్రమ రిజిస్ట్రేషన్లు చేయొద్దని, ఏ అంశంపైనైనా ఎక్కడికి రమ్మన్నా తాను చర్చలకు సిద్ధంగా ఉన్నానని, చట్టాన్ని మరియు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం చెల్లదని పేర్కొంటూ సూర్యాపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన వట్టే జానయ్య యాదవ్ ను పోలీసులు సాయంత్రం అరెస్టు చేశారు. పట్నంలోని వజ్రా టౌన్‌షిప్‌కు సంబంధించిన వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఉదయం 10 గంటల సమయంలో వట్టే జానయ్య యాదవ్ సబ్-రిజిస్ట్రార్‌ను కలిసి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ అధికార పార్టీ నాయకులు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



ఈ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ, “ఇది అక్రమ రిజిస్ట్రేషన్. దీనిపై ఎంత పెద్ద అధికారి ముందైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాను. అధికారంలో ఉన్నారని ఇలాంటి అక్రమాలు చేస్తే ప్రజలు అంగీకరించరు” అని పేర్కొంటూ కార్యాలయం ముందు బైఠాయించారు. అయితే పోలీసులు ఆయన అభ్యంతరాలను, చర్చలకు సిద్ధమన్న మాటను పట్టించుకోకుండా బలవంతంగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా “పోలీస్ దౌర్జన్యం నశించాలి” అంటూ వట్టే జానయ్య యాదవ్ నినాదాలు చేశారు. ఉదయం నుంచి నిరవధికంగా ధర్నాలో పాల్గొనడం, అరెస్టు సమయంలో జరిగిన తోపులాట కారణంగా వట్టే జానయ్య యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. రక్తపోటు (బీపీ) ఒక్కసారిగా పడిపోవడంతో ఆయనను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేసినట్లు సమాచారం. తనపై జరుగుతున్న చర్యలు రాజకీయ కుట్రలో భాగమేనని వట్టే జానయ్య యాదవ్ ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల నాయకుడిగా ఎదగడం, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం కొందరికి ఇష్టం లేకపోవడంతో తనను రాజకీయంగా దెబ్బతీయడానికి, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వట్టే జానయ్య యాదవ్ అరెస్టు నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. “అధికారం ఈరోజు మీ చేతిలో ఉండవచ్చు... కానీ భవిష్యత్తు ప్రజల చేతిలో ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నాలు ఎప్పటికీ నిలవవు” అని వట్టే జానయ్య యాదవ్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిస్తే సహించం

**- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వక్కలంక శ్రీనివాస రావు**



**రంగారెడ్డి, జూన్ 05 (సూర్య సేన) :** పోరాటాలతో తెచ్చుకున్న తెలంగాణను కించపరిచే విధంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన కుట్రపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎంత ధైర్యం ఉ ంటే తెలంగాణ మీ అయ్య జాగీరా? అంటారా అని పవన్ కళ్యాణ్ ను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణను ఉగ్రవాదంతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణను అవమానిస్తుంటే దేవుడినైనా ఎదిరిస్తామని ఎవరు అవమానించిన క్షమించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భూములను

ఆక్రమించుకుంటూ తెలంగాణ ఉనికికే ముప్పు తెచ్చే విధంగా వ్యవహరించడం తగదు అన్నారు. భూకబ్జా పర్వంలో చంద్రబాబుకు సిగ్గు ఉండాలని అన్నారు .ఆయన హయాంలో తెలంగాణ భూములను కారు చౌకగా కాజేశారనిఆరోపించారు. ఇప్పటికైనా తెలంగాణ పై ఆంధ్రకు చెందిన పెత్తందారులను తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణపై కారు కూతలు కూసిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు వ్యక్తిగత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సూర్యాపేట మున్సిపాలిటీకి ‘ఉత్తమ పర్యావరణ’ పురస్కారం......

– మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, కమిషనర్ హన్మంత రెడ్డి...

హైదరాబాద్, జూన్ 05 (సూర్య సేన): వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రదానం చేసే లి‘ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారంలి’కు సూర్యాపేట మున్సిపాలిటీ ఎంపికైంది. ఈ పురస్కారాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ, అటవీ శాఖ మరియు ఎన్విరాన్ మెంట్ మంత్రివర్యులు కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి అందుకున్నారు. పట్టణంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, పారిశుధ్య కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో సూర్యాపేట మున్సిపాలిటీ కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయడం, పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి.




ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీకి లభించిన ఈ పురస్కారం పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి సూర్యాపేటను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట అమలు చేస్తున్న వినూత్న విధానాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ అవార్డుతో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలో పర్యావరణహిత పట్టణాల జాబితాలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

# జయహో సూర్యసేన....

సూర్యుడిలా ఉదయించి..
సత్య కిరణాలు చిమ్ముతూ..
ప్రజల గుండె చప్పుడు విని..
పదునైన కలంతో..
పలికేది సూర్యసేన..!

పల్లె దారి దుమ్ములోనూ..
పట్టణ వీధి సందడిలోనూ..
పేదవాడి బాధలోనూ..
రైతన్న కన్నీటి చుక్కలోనూ..
ప్రజల పక్షాన నిలిచేది..
సూర్యసేన..!
అధికార అహంకారానికి..
అక్షరమే ఆయుధమై..
అన్యాయ అంధకారానికి..
నిజమే దీపమై ధైర్యంగా ..
ముందుకు నడిచేది



సూర్యసేన..!
మూడు వసంతాలు
పూర్తి చేసి..
నాలుగో వసంతంలోకి
అడుగిడినా..
ఉత్సాహం తగ్గని..
యువసైనికుడిలా..
ప్రతి ఉదయం ప్రజల కోసం..
కొత్త ఆశలను..
మోసుకొస్తోంది..
సూర్యసేన..!
ఎదుగుతూ..
వెలుగుతూ ఉండాలి
మా అక్షర సూర్య
“సూర్యసేన”...!

**-- సూర్యసేన తృతీయ వార్షికోత్సవ శుభాకాంక్షలతో..**
**-- చక్రవర్తి**

# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ

నేరేడుచర్ల ప్రతినిధి, జూన్ 05 సూర్య సేన): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ఆదర్శ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పర్యావరణ క్లబ్, యువ భూమి నాయకుల బృందానికి చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటి, పాఠశాలలోని మాతృవృక్షం వద్ద పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బట్టు మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏటా కనీసం ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. వ్యర్థాలను పునర్వినియోగం చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్. నరసింహారావు, ఎం. యాదగిరి, వి. శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రెడ్డి, గురునాథం, వెంకటేశ్వర్లు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్లు చెల్లవు... సబ్ రిజిస్టర్ ఆఫీస్ ముందు ధర్నా



– వట్టే జానయ్య యాదవ్ అరెస్టు...సబ్ రిజిస్టార్ కార్యాలయం వద్ద నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత

**సూర్యాపేట టౌన్, జూన్ 05 (సూర్య సేన) :** అక్రమ రిజిస్ట్రేషన్లు చేయొద్దని ఏదైనా అంశం ఉంటే ఎక్కడికి రమ్మన్నా తాను చర్చలకు వస్తానని చట్టాన్ని అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇష్టం వచ్చినట్టు చేస్తానంటే చెల్లదని సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు ధర్నా దిగిన వట్టే జానయ్య యాదవ్ను సాయంకాలం పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేటలో ఉన్న వజ్రా టౌన్షిప్ సంబంధించి ఒక మనిషి అనేక నేరాలకు కారణమైన మనిషి ఇప్పటికే అనేక వివాదాగ్రస్త నిర్ణయాలు తీసుకున్న ఒక దొరసాని మరొక వివాదానికి తెరలేపుతున్నదని రిజిస్ట్రేషన్ చేసే ప్రయత్నం చేస్తున్నదని ఇది సరైనది కాదని ఉదయం 10 గంటల సమయంలో రిజిస్టార్ ను కలిసి చేయవద్దని విజ్ఞప్తి చేశారు అయినా అధికార పార్టీ నాయకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కార్యాలయానికి వచ్చారు. ఆ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ ఇది అక్రమ రిజిస్ట్రేషన్ దీనిపైన ఎంత పెద్ద అధికారి ముందైనా నేను మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నాను మీకు అధికారం ఉంది కదా అని ఇలాంటి అక్రమాలు చేస్తే ప్రజలు అంగీకరించరని కార్యాలయం ముందు బైఠాయించారు. జానయ్య బడుగు బలహీన వర్గాల నాయకుడిగా ఎదగడం ఇష్టం లేక రాష్ట్రంలో ముఖ్యమైన పాత్రను పోషించడం వల్ల ఎలాగైనా రాజకీయాల నుంచి తప్పించాలని అందుకే అనేక రకాల చిక్కులు సృష్టించాలని ఆర్థికపరమైన ఇబ్బందులు పెట్టాలని కుట్రలో భాగంగా తన పైన ఈ దాడి జరుగుతుందని జానయ్య ఆరోపించారు.

పోలీసులు జానయ్య మాట వినకుండా బలవంతంగా లాక్కుపోయారు. ఆ సమయంలో బట్టే జానయ్య యాదవ్ పోలీస్ దౌర్జన్యం నశించాలని నినాదాలు చేశారు ఎక్కడికైనా వస్తానని చెబుతున్న వినకుండా పోలీసులు అధికార పార్టీకి అండగా నిలిచి జానయ్యను అరెస్ట్ చేశారు. పూర్తిగా ఉదయం నుండి ధర్నాలో ఉ ఒడడం వల్ల జానయ్య అనారోగ్యం పాలయ్యారు బీపీ పూర్తిగా పడిపోవడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు ఈ



మొత్తం పరిస్థితిని సభ్య సమాజం చూడాలని అధికార పార్టీ దౌర్జన్యం మంచిది కాదని అధికారం ఇప్పుడు ఉండవచ్చు రేపు భవిష్యత్తు మాదే అనే విషయం మర్చిపోవద్దని జానయ్య అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు జాన య్యా వెంట అనుసరించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది.

## గంజాయి నిర్మూలనే లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు.....








– జాతీయ రహదారి వెంట హోటల్స్, దాబాలు, విద్యాసంస్థల్లో తనిఖీలు

**సూర్యాపేట టౌన్ / రూరల్, జూన్ 05 (సూర్య సేన) :** జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శుక్రవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారని ఎస్సై తెలిపారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన, గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో పట్టణ కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, జాతీయ రహదారి వెంట హోటల్స్ దాబాలు, పాన్ డబ్బాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన న్యాయమూర్తులు...



**హుజూర్నగర్ ప్రతినిధి, జూన్ 05 (సూర్య సేన) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హుజూర్నగర్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్సుందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాసర్లగడ్డ దీప, అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆయేషా సరీన్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఆర్వీ రమణారెడ్డి, జక్కుల వీరయ్య, బి. సురేష్ నాయక్తో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాతావరణ హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలి

– అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలి: ఎస్సై శ్రీకాంత్ గౌడ్



**గరిడేపల్లి ప్రతినిధి, జూన్ 05 (సూర్య సేన) :** రానున్న రోజుల్లో గాలిదుమ్ములు, ఈదురుగాలులు, ఉరుములు-పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత గోడల సమీపంలో నిలబడవద్దని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా భయపడకుండా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉ ంటారని పేర్కొన్నారు. "ప్రజల భద్రతే మా బాధ్యత.. మీ అప్రమత్తతే మీ రక్షణ" అని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

## అఖిలపక్ష ప్రతినిధులతో గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్...



నల్గొండ, జూన్ 05 (సూర్య సేన): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అఖిల పక్ష ప్రతినిధులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయా ఆవరణలో ఉన్న గోదాంకు ఆయన అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆయా పార్టీల రాజకీయ ప్రతినిధులతో కలిసి వారి ఎదురుగా గోదామును తెరిపించి గోదాంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు,వి వి ఫ్యాట్ లను పరిశీలించడమే కాక వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రతి మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే గోదాములో ఉన్న ఈవీఎంలు, వివి ప్యాడ్ లను పరిశీలించడంలో భాగంగా ఈ తనిఖీ చేసినట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్, టిఆర్ఎస్ నుండి పిచ్చయ్య, సిపిఐ ఎం నుండి నర్సిరెడ్డి, టిడిపి నుండి ఏ .రవి, ఎంసీఏ నుండి ఎండి రఫీ, బిఎస్ పి నుండి యాదగిరి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.



## జాతీయ ఉపకార వేతనానికి ఆరుగురు విద్యార్థుల ఎంపిక.....

**నేరేడుచర్ల ప్రతినిధి, జూన్ 05 (సూర్య సేన) :** నేరేడుచర్ల మండల కేంద్రంలోని ప్రధానమంత్రి ఆదర్శ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతన పథకానికి ఎంపికయ్యారు.

రూపావత్ శశిప్రియ,
ఎండి అబ్దుల్ దిల్షాద్, టి.సాయి తేజ, జి.రామ్చరణ్, షేక్ ఇంతియాజ్, వి.సాగర్ ఈ ఉపకార వేతనాన్ని పొందనున్నారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్లపాటు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున మొత్తం రూ.48 వేల
ఆర్థిక సహాయం అందనుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఉపకార వేతనానికి పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.



పుట్టపాక సాగర్



షేక్ ఇంతియాజ్



గుంజ రామ్ చరణ్



తీగలపల్లి సాయి తేజ

## స్వర్గీయ బండపల్లి లింగయ్య చిత్రపటానికి నివాళు లర్పించిన ఏఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి....



**తుంగతుర్తి ప్రతినిధి / నూతనకల్, జూన్ 05 (సూర్య సేన) :** నూతనకల్ మండల కేంద్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండపల్లి లింగయ్య చిత్రపటానికి శుక్రవారం ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో నూతనకల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, పిఎసిఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న,బంటు బద్రి,బోల్క సైదులు, బద్దం ప్రశాంత్ రెడ్డి మేడిపల్లి అశోక్, శంకర్, రాజశేఖర్ రెడ్డి, మధు గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు సామ ఉపెందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొగదాల లక్ష్మణ్ గౌడ్, నాగు నాయక్, పడిదల రవి, మల్లెపాక అనిల్, శాంతయ్య, తదితరులు ఉన్నారు.



ఎండి అబ్దుల్ దిల్షాద్



రామావత్ శశి ప్రియ




# విమాన ఇంధన ధర స్థిరీకరణకు రూ. 10,000 కోట్ల నిధి



దిల్లీ: విమానయాన కంపెనీలకు కేంద్రం ఊరటనిచ్చింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల నుంచి విమానయాన సంస్థలను ఆదుకోవడానికి, ఛార్జీల అస్థిరతను పరిమితం చేయడం లక్ష్యంగా కేంద్ర మంత్రివర్గం బుధవారం రూ.10,000 కోట్ల విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ప్రకటన ప్రకారం, ఈ నిధి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)లకు వడ్డీ లేని అడ్వాన్స్‌లను అందిస్తుంది. దీనివల్ల ఆ కంపెనీలు దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాల కోసం భారతీయ వి సంస్థలకు ఏటీఎఫ్‌ను స్థిరమైన ధరకు సరఫరా చేయగలుగుతాయి. లీటరుకు రూ.75.60గా నిర్ణయం విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చుల్లో ఇంధనం సుమారు 40 శాతం, కొన్ని సందర్భాల్లో తీవ్ర అస్థిరత ఉన్న కాలంలో 60 శాతం వరకు వాటా కలిగి ఉంటుంది. మార్చిలో లీటరుకు రూ.60.50గా ఉన్న అంతర్జాతీయ ఏటీఎఫ్ ధర మే నెలలో లీటరుకు రూ.142కు పెరగడంతో విమానయాన సంస్థలపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ సహాయక చర్యలను చేపట్టింది. ఈ నిర్ణయంపై సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, దేశీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను లీటరుకు రూ.75.60గా ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది ప్రస్తుత మార్కెట్ ధర కంటే గణనీయంగా తక్కువని తెలిపారు. ప్రయాణికులకు అధిక ఛార్జీల నుంచి ఉపశమనం! ఈ పథకం విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులను స్థిరీకరించడానికి, ప్రయాణికులకు ఛార్జీల హెచ్చుతగ్గులను పరిమితం చేయడానికి, దేశీయ-అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని పరిరక్షించడానికి సహాయపడుతుందని వైష్ణవ్ వెల్లడించారు. ఈ నిధి ప్రపంచ చమురు ధరల పెరుగుదల కారణంగా ఏర్పడే ఛార్జీల పెరుగుదల నుంచి విమాన ప్రయాణికులను కాపాడటంతో పాటు విమానయానంపై ఆధారపడిన 77 లక్షల మంది ఉద్యోగాలను కూడా పరిరక్షిస్తుందని వివరించారు. ఎప్పటిదాకా ఈ వెసులుబాటు? ఈ పరిమితి విమానయాన సంస్థలకు తక్షణ ఉపశమనం కలిగిస్తుందని అంచనా వేస్తున్నప్పటికీ, ఇది రిఫైనరీలు, ఇంధన రిటెయిలర్లపై ఆర్థిక ఒత్తిడిని పెంచవచ్చు.

# పసిడిని ఆర్‌బీఐ విక్రయించలేదు...



ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పెద్దఎత్తున పసిడిని విక్రయించినట్లు వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఫారెక్స్ నిల్వలు కాపాడుకోవడానికి ఆర్‌బీఐ బంగారాన్ని విక్రయించిందంటూ వచ్చిన బ్లూమ్‌బర్గ్ కథనాన్ని తోసిపుచ్చింది. ఆ వార్తలు పూర్తి అవాస్తవమని పేర్కొంది. ఈ మేరకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టింది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. విదేశీ మదుపర్లు మన మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కి తీసుకుంటున్నారు.

దీంతో రూపాయి మారక విలువ పడిపోతోంది. ఫారెక్స్ నిల్వలు తగ్గిపోతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు ఆర్‌బీఐ 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.14 లక్షల కోట్ల) పసిడిని విక్రయించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో తెలిపింది. దీన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న ఫారెక్స్ నిల్వల్లో పసిడి వాటా 2025లో 13.92 శాతం ఉండగా, 2026 మార్చి 31 నాటికి 16.70 శాతానికి పెరిగినట్లు తెలిపింది. మే 22 నాటికి 16.85 శాతానికి చేరిందని పేర్కొంది. 2025 మార్చి 31 నాటికి ఆర్‌బీఐ వద్ద 879.58 మెట్రిక్ టన్నులు ఉందని, 2026 మార్చి 31 నాటికి 0.94 టన్నుల మేర పెరిగి 880.52 మెట్రిక్ టన్నులకు చేరిందని తెలిపింది.

# రూ.15.15 లక్షల కోట్ల ఆదాయమంటూ రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ అవకతవకలు.. సెబీ చర్యలు



బెంగళూరుకు చెందిన ప్రముఖ జ్యువెలరీ రిటైల్ సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌పై సెబీ చర్యలు చేపట్టింది. ఈ సంస్థ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కంపెనీ, దాని ప్రమోటర్ అయిన రాజేశ్ మెహతాను సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి తాత్కాలికంగా నిషేధించింది. దీంతో నేటి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో ఈ కంపెనీ షేర్లు పతనమయ్యాయి. దీని షేరు విలువ 5శాతం నష్టంతో లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ.103.92కు పడిపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో నేటి ట్రేడింగ్‌లో ఎల్ఐసీ (నా×జ) షేర్లు కూడా కుంగిపోయాయి. ఒక దశలో షేరు విలువ 1శాతానికి పైగా పడిపోయింది. ఉదయం 11 గంటల సమయంలో నిఫ్టీలో ఎల్ఐసీ షేరు విలువ 0.77శాతం నష్టంతో రూ.399.80 వద్ద ట్రేడ్ అవుతోంది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఎల్ఐసీ కి 10.80శాతం వాటాలు ఉండటమే ఈ నష్టాలకు కారణం. విదేశీ మదుపర్లకు కేంద్రం కిక్.. పన్ను నుంచి మినహాయింపు..!

రాజేశ్ ఎక్స్‌ఫోర్ట్స్ ఏకీకృత ఆదాయంలో 97-99శాతం దాని విదేశీ అనుబంధ సంస్థల నుంచే సమకూరుతోంది. ముఖ్యంగా స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే సంస్థ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు కంపెనీ పేర్కొంది. అయితే, ఆ అనుబంధ సంస్థల ఆర్థిక లావాదేవీలను మాత్రం కంపెనీ బహిర్గతం చేయలేదు. దీంతో సెబీ తనిఖీలు చేపట్టగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్విట్జర్లాండ్ సంస్థ స్టాండ్‌ఎలోన్ ఆదాయం చాలా తక్కువగా ఉండగా.. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ మాత్రం దాన్ని పెంచి చూపించినట్లు సెబీ దర్యాప్తులో గుర్తించింది. అలా 2021-2025 ఆర్థిక సంవత్సరాల మధ్య దాదాపు రూ.15.15లక్షల ఆదాయం సమకూరినట్లు కంపెనీ తప్పుడు ప్రచారం చేసుకుందని సెబీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెగ్యులేటరీ చర్యలు చేపట్టింది.

# విప్రో సీఈఓ పల్లియాకు రూ.49.64 కోట్ల పారితోషికం



దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో విప్రో ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) శ్రీనివాస్ పల్లియా మొత్తంగా రూ.49.64 కోట్ల (5.29 మిలియన్ డాలర్లు) పారితోషికాన్ని అందుకున్నారు. ఇందులో వేతనాలు, ఇతర భత్యాలు 1.65 మిలియన్ డాలర్లు కాగా.. కమీషన్, వేరియబుల్ పే రూపేణా 1.05 మిలియన్ డాలర్లు, ఇతర ప్రయోజనాల కింద 2.47 మిలియన్ డాలర్ల, దీర్ఘకాలిక కంపెన్సేషన్ కింద 1,08,464 డాలర్లను ఆయన పొందినట్లు విప్రో వార్షిక నివేదిక తెలిపింది. విప్రో సీఈఓ, ఎండీగా ఏప్రిల్ 2024లో పల్లియా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. 2025-26లో విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీకి 7,73,231 డాలర్ల (సుమారు రూ.7.25 కోట్లు) పారితోషికం లభించింది. ఎటువంటి స్టాక్ ఆప్షన్స్ ఆయనకు ఇవ్వలేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఏకీకృత నికర లాభం వృద్ధిపై 0.35 శాతం కమీషన్‌ను ప్రేమ్‌జీ, పల్లియా పొందారు. కంపెనీ ముఖ్య ఆర్థిక అధికారి అపర్ణ సి అయ్యర్ 7,17,749 డాలర్ల (రూ.6.73 కోట్లు) పారితోషికం అందుకున్నారు. విప్రోకు పోటీ సంస్థలైన ఇన్ఫోసిస్, టీసీఎస్ సీఈఓల వేతనాలను గమనిస్తే.. ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ 2025-26లో మొత్తంగా రూ.82.60 కోట్ల పారితోషికం పొందారు. ఈ మూడు సంస్థలో సారథుల్లో పరేఖ్‌కే అత్యధిక పారితోషికం లభించింది. టీసీఎస్ సీఈఓ, ఎండీ కృతివాసన్ రూ.28 కోట్ల పారితోషికాన్ని అందుకున్నారు. ఇన్ఫోసిస్, టీసీఎస్ సీఈఓల పారితోషికాల మధ్యలో విప్రో సీఈఓ పారితోషికం ఉంది. ఎటువంటి స్టాక్ ఆప్షన్స్ ఆయనకు ఇవ్వలేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఏకీకృత నికర లాభం వృద్ధిపై 0.35 శాతం కమీషన్‌ను ప్రేమ్‌జీ, పల్లియా పొందారు.

# క్రెడిట్ స్కోర్‌పై ఈ అపోహలు వద్దు...




బ్యాంకింగ్ రంగంలో, లోన్ మార్కెట్‌లో క్రెడిట్ స్కోర్‌కున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. అయితే ఈ క్రెడిట్ స్కోర్‌పై చాలామందిలో అనేక అపోహలు నెలకొన్నాయి. అవి మీ డబ్బునేగాక, మీ రుణ పరపతినీ దెబ్బతీసే అవకాశాలున్నాయి. మరి అసలు నిజాలేంటి?.. ఇదీ నిజం: క్రెడిట్ స్కోర్‌ను తరచూ మనం చెక్ చేస్తే.. దాని ప్రభావం స్కోర్‌పై పడి తగ్గుతుందన్నది చాలామంది నమ్మకం. కానీ ఇందులో నిజం లేదు. మనంతట మనం క్రెడిట్ స్కోర్‌ను చూసుకోవడం.. సాఫ్ట్ ఎంక్వైరీ. దీనివల్ల క్రెడిట్ రేటింగ్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. అయితే రుణం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు రుణదాతలు (బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు) చేసే హార్డ్ ఎంక్వైరీతో స్వల్పంగా స్కోర్ తగ్గి తాత్కాలికంగా పడిపోగలదు. ఇదీ నిజం: క్రెడిట్ కార్డ్ ద్వారా తీసుకున్న రుణంలో అసలును వదిలేసి వడ్డీలను చెల్లిస్తూపోతే స్కోర్ పెరుగుతుందన్నది కొందరిలో ఉన్న అపోహ. నిజానికి అలాచేస్తే మీ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో మాత్రమే పెరుగుతుంది. కానీ ఏ నెలకు ఆ నెల పూర్తి స్థాయిలో మీ క్రెడిట్ బిల్లులను చెల్లిస్తేనే మంచిది. ఇదీ నిజం: మీ జీతం లేదా మీ వ్యాపార ఆదాయం.. ఎప్పుడు కూడా మీ క్రెడిట్ స్కోర్ గణనకు కారణం కాబోదు. రుణ దరఖాస్తుల పరిశీలన సమయంలోనే బ్యాంకర్లు, ఎన్‌బీఎఫ్‌సీలు మీ క్రెడిట్ స్కోర్‌ను సమీక్షిస్తారు. ఇదీ నిజం: వాడకంలో లేని పాత క్రెడిట్ కార్డుల ఖాతాలను మూసేస్తే క్రెడిట్ స్కోర్ పెరుగుతుందన్నది చాలామందిలో ఉన్న అపోహ. నిజానికి అలాచేస్తే మీ రుణ చరిత్ర తగ్గి స్కోర్‌ను ప్రభావితం చేసే ప్రమాదం ఉన్నది. కాబట్టి జీరో బ్యాలెన్స్‌తోనైనా వాటిని అలాగే ఉంచుకోవడం ఉత్తమం. స్కోర్ సమీక్షలో మీ క్రెడిట్ హిస్టరీ పరిశీలనకు దోహదం చేస్తాయి. ఇదీ నిజం: రుణాలు లేకపోతేనే క్రెడిట్ స్కోర్ బాగుంటుందన్నది చాలామందిలో ఉన్న నమ్మకం. అయితే రుణాలు తీసుకోకపోతే మీకు క్రెడిట్ స్కోరే ఉండదు. కాబట్టి అవసరమైనప్పుడు రుణాలు తీసుకుని, వాటిని క్రమం తప్పకుండా చెల్లిస్తేనే ఆకర్షణీయమైన క్రెడిట్ స్కోర్ ఉంటుంది.

# డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్.....



హైదరాబాద్: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ అవతరించింది. ఐటీ రంగానికే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల కేంద్రంగానూ హైదరాబాద్ రూపాంతరం చెందుతోంది. 2022లో 60.9 మెగావాట్ల (ఎండబ్ల్యూ) వద్ద ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యం 2025 నాటికి 151.4 మెగావాట్లకు చేరుకుంది. మరో 1.9 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, ఈ విషయంలో ముంబయి తర్వాత స్థానం హైదరాబాద్‌దేనని స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదిక 'ఇండియా డేటా సెంటర్ మార్కెట్ అప్‌డేట్-2025'లో వెల్లడించింది. ఖరీదైన నగరాలతో పోలిస్తే హైదరాబాద్ డేటా సెంటర్లకు అనుకూలమైన ప్రత్యామ్నాయంగా మారింది. విపత్తులు తలెత్తని భౌగోళిక అనుకూలత ఉండటం ప్రధాన బలంగా నిలుస్తోందని నివేదిక పేర్కొంది. దీనికి తోడు హై-డెన్సిటీ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూ), లిక్విడ్ కూలింగ్ వంటి వాటికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలూ కలిసొస్తున్నాయని తెలిపింది. ఎన్‌టీటీ, అదానీకనెక్స్ వంటి సంస్థలు ఇక్కడ తమ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్నట్లు నైట్ ఫ్రాంక్ పేర్కొంది. అంతర్జాతీయ సంస్థల రాకతో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు తమ డేటా సెంటర్ల కోసం హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. మైక్రోసాఫ్ట్ తన ఇండియా సౌత్ సెంట్రల్ డేటా సెంటర్‌ను ఈ ఏడాదిలో ప్రారంభించనుంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే నగరంలో మూడు జోన్‌లను నిర్వహిస్తోంది. దీని మార్కెట్ వాటా 46 శాతం ఉంది. మరోవైపు ఒరాకిల్ సైతం దేశీయంగా తన సామర్థ్యాన్ని విస్తరించుకునేందుకు హైదరాబాద్‌లో కొత్త డేటా సెంటర్‌ను ప్రకటించింది.

దేశవ్యాప్తంగా 1.6 గిగావాట్లకు భారతదేశ డేటా సెంటర్ మార్కెట్ కీలక దశకు చేరుకుందని నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. దేశంలోని ఏడు ప్రధాన నగరాల మార్కెట్లలో (ముంబయి, చెన్నై, దిల్లీ, బెంగళూరు, పుణె, హైదరాబాద్, కోల్‌కతా) లైవ్ ఐటీ సామర్థ్యం 2025 చివరి నాటికి 1.6 గిగావాట్లను దాటింది. ఏఐ, క్లౌడ్, డేటా స్థానికీకరణ నిబంధనల కారణంగా డేటా సెంటర్ల రంగంలో అనూహ్యమైన వృద్ధి కనిపిస్తోంది. 2024లో దేశంలో కొత్తగా 361.6 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి రాగా, 2025లో ఇది మరింత పెరిగి 371.5 మెగావాట్లకు చేరింది. ఈ సందర్భంగా నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ మాట్లాడుతూ.. భారతీయ డేటా సెంటర్ల రంగం సంప్రదాయ ఐటీ హబ్‌లకే పరిమితం కాకుండా, కొత్త ప్రాంతాలకూ ఇవి విస్తరిస్తుండటం ప్రత్యేకత అని పేర్కొన్నారు.




## మొన్న చిరు.. నేడు నాగ్.. సెట్ అయ్యేనా



టెక్నాలజీని ఫిల్మ్ ఇండస్ట్రీ చాలా బాగా వాడుకొంటుంది అని చెప్ప డంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఏఐ టెక్నాలజీ ద్వారా కొత్త ప్రపంచాన్నే చూపిస్తున్నారు దర్శకులు. ముఖ్యంగా ఇప్పుడు వయసైన హీరోలను వారి యుక్త వయస్సులో ఉన్నట్లు చూపించడం ట్రెండ్ గా మారింది. ఆచార్య చిత్రంలో చిరంజీవిని టెక్నాలజీ ఉపయోగించి యంగ్ లుక్ లో చూపించారు డైరెక్టర్ కొరటాల శివ. రిస్క్ చేసినా చిరుకు ఫలితం దక్కలేదు.

అప్పుడు చిన్న చిన్న మిస్టేక్స్ చేయడం వలన చిరు లుక్ ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. కానీ, ఏఐ వచ్చాక వింటేజ్‌లుక్ ని క్రియేట్ చేయడం ఈజీగా మారింది. అందుకు ఉదాహరణే కూలీ. ఈ సినిమాలో రజనీకాంత్ ను యంగ్ లుక్ చూపించి లోకేష్ కనగరాజ్ సక్సెస్ అయ్యారు. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా రజనీ యంగ్ లుక్ కి మాత్రం మంచి ఆదరణ లభించింది. ఇక ఇప్పుడు ఈ యంగ్ లుక్ ని అక్కినేని నాగార్జున కూడా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

అక్కినేని నాగార్జున వందవ సినిమా కింగ్ 100. తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో టబు హీరోయిన్ గా నటిస్తోన్నారు. ఎలాంటి హడావిడి లేకుండా ఈ సినిమా షూటింగ్ ని జరుపుకొంటుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఒక వార్త ప్రేక్షకుల్లో ఎక్కువ ఆసక్తిని రేకెత్తిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ చిత్రంలో నాగ్ ని పాతికేళ్ళ కుర్రాడిగా చూపించనున్నారట.

ఏఐ టెక్నాలజీని ఉపయోగించి నాగ్ వింటేజ్ లుక్ ని క్రియేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. పాతికేళ్ళ క్రితం అంటే శివ సమయంలో నాగ్ ఎలా ఉండేవారో..

అప్పుడు చిన్న చిన్న మిస్టేక్స్ చేయడం వలన చిరు లుక్ ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. కానీ, ఏఐ వచ్చాక వింటేజ్‌లుక్ ని క్రియేట్ చేయడం ఈజీగా మారింది. అందుకు ఉదాహరణే కూలీ. ఈ సినిమాలో రజనీకాంత్ ను యంగ్ లుక్ చూపించి లోకేష్ కనగరాజ్ సక్సెస్ అయ్యారు. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా రజనీ యంగ్ లుక్ కి మాత్రం మంచి ఆదరణ లభించింది. అలా కనిపించబోతున్నారట. ఆచార్య సమయంలో ఇలా చేయడానికి ఖర్చు ఎక్కువ అయినా.. ఇప్పుడు మాత్రం పెద్దగా ఖర్చు కూడా లేకపోవడంతో నాగ్ సైతం ఓకే అన్నారని టాక్. ఇదే కనుక నిజమైతే మన్మథుడు వింటేజ్ లుక్ చూడడానికి అయినా ఫ్యాన్స్ థియేటర్స్ కి పరుగులు తీస్తారని అక్కినేని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మరి పాతికేళ్ల కుర్రాడిగా నాగ్ అభిమానులను మెప్పిస్తారా.. ? లేదా అనేది చూడాలి.


## ‘ఖల్‌నాయక్ రిటర్న్స్’లో ఐటెం సాంగ్



సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ ‘ఖల్ నాయక్’ చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ‘ఖల్ నాయక్ రిటర్న్స్’ పేరుతో ఇది తెరకెక్కనుంది. ‘ఖల్ నాయక్’లోని ‘చోలీ కే పీచే క్యా హై’ పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వంద్వార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నాపలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్లక్రితం ‘స్త్రీ–2’ చిత్రంలో తమన్నా చేసిన ‘ఆజ్ కి రాత్’ ప్రత్యేక గీతంవిశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ‘ఖల్ నాయక్ రిటర్న్స్’లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.


## రిపోర్టర్ అడిగిన ప్రశ్నకి వేదికపై..

## కన్నీళ్లు పెట్టుకున్న పాయల్ రాజ్‌పుత్



‘ఆర్‌ఎక్స్ 100’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తాజాగా ఒక సినిమా వేడుకలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన వ్యక్తిగత జీవితంలోని విషాదాన్ని తలచుకుని వేదికపైనే కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ కలిచివేసింది. హేమంత్ ఇప్పలపల్లి దర్శకత్వంలో రూపొందిన ‘ఫస్ట్ టైమ్ 01-01-01’ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో పాయల్ చిన్ననాటి స్నేహితుడు సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్నాడు. స్నేహితుడిని ప్రోత్సహించేందుకు ముఖ్య అతిథిగా హాజరైన పాయల్, సినిమా గురించి మాట్లాడుతూ విజువల్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఈవెంట్ ముగింపు సమయంలో ఒక విలేకరి అడిగిన ప్రశ్న ఆమెను భావోద్వేగానికి గురిచేసింది. గతంలో ఆమె విపాసన ధ్యానం కోసం వెళ్లిన విషయాన్ని ప్రస్తావించగా, పాయల్ తన తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ను గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. మా నాన్నే నా జీవితానికి హీరో. నేను చేసిన ప్రతి సినిమాను ఆయనే మొదట చూసి తన అభిప్రాయం చెప్పేవారు. రీసెంట్‌గా వచ్చిన నా పంజాబీ సినిమా చూడాలని ఆయన ఎంతో ఆశపడ్డారు. కానీ ఇప్పుడు ఆయన మన మధ్య లేరు” అంటూ పాయల్ వెక్కి వెక్కి ఏడ్చేశారు. ‘ఆర్‌ఎక్స్ 100’ వంటి బోల్డ్ చిత్రంలో నటించినప్పటికీ తన నటనను తండ్రి మెచ్చుకున్నారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో భావోద్వేగాన్ని ఆపుకోలేక వేదికపైనుంచి వెళ్లిపోవాల్సివచ్చింది. చిత్ర బృందం ఆమెను ఓదార్చేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆమె బాధ అందరినీ కదిలించింది. పాయల్ తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ గత ఏడాది జూలై 28న కన్నుమూశారు. అన్నవాహిక క్యాన్సర్‌తో పోరాడుతూ 67 ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడిచారు. తండ్రి అనారోగ్య సమయంలో కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, మానసిక ఒత్తిడి గురించి పాయల్ గతంలో కూడా పంచుకున్నారు. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె విపాసన ధ్యానంను ఆశ్రయించారు. ఇది భారతదేశపు ప్రాచీన ధ్యాన విధానం కాగా, మనస్సును శాంతపరచడం, భావోద్వేగాలను నియంత్రించడం కోసం ఉపయోగపడుతుంది. ఈ ధ్యానం ద్వారా పాయల్ తన జీవితంలో జరిగిన విషాదాన్ని అంగీకరించి ముందుకు సాగేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

## అభిమానులతో రెండో పెళ్లి తర్వాత తొలి పుట్టినరోజు..



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు తన పుట్టినరోజును ఈసారి ఎంతో ప్రత్యేకంగా, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా రెండో వివాహం తర్వాత వచ్చిన తొలి పుట్టినరోజు కావడంతో ఈ వేడుకకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. చాలా కాలం తర్వాత సమంత తన అభిమానులతో నేరుగా కలుసుకోవడం విశేషం. ఫ్యాన్స్ సమక్షంలో కేక్ కట్ చేస్తూ, వారితో ముచ్చటిస్తూ గడిపిన క్షణాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమెను చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సమంత చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ, అభిమానులతో ఫోటోలు దిగుతూ ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. సమంత కెరీర్ పరంగా కూడా కీలక దశలో ఉన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ, ఆమె తన ప్రొఫెషనల్ ప్రయాణాన్ని బ్యాలెన్స్‌డ్‌గా కొనసాగిస్తున్నారు. అభిమానులతో ఇలాంటి వేడుక జరుపుకోవడం ఆమెకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని తెలుస్తోంది. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు. “స్టే స్ట్రాంగ్”, “హ్యాపీ బర్త్‌డే క్వీన్”, “మరిన్ని విజయాలు సాధించాలి” అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. సమంత ఈసారి తన పుట్టినరోజును మరింత భావోద్వేగంగా, అభిమానులతో కలిసి జరుపుకోవడం ఒక మధురమైన మైలురాయిగా నిలిచింది. త్వరలో సమంత మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తుంది. ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిర్మాతగా వ్యవహరించారు. సమంత మూవీ ప్రమోషన్స్‌లో చాలా యాక్టివ్‌గా పాల్గొంటూ ఆసక్తికర విషయాలు వెల్లడిస్తుంది.

## ‘మైసా’ కోసం ప్రాణాలకు తెగించిన రష్మిక..

తాను పోషించే పాత్ర కోసం ఎంతటి సవాళ్లైనా స్వీకరించే కథానాయికల్లో రష్మిక మందన్న ముందుంటారు. మరోసారి ఆమె తన నటనపై ఉన్న అంకితభావాన్ని నిరూపిస్తూ వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం తెరకెక్కుతున్న ‘మైసా’ చిత్రంలో రష్మిక చేస్తున్న పాత్ర, అందుకు ఆమె పడుతున్న కష్టం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఇది సాధారణ గ్లామర్ పాత్ర కాకుండా, భావోద్వేగాలు, కోపం, ఆవేశం కలగలిపిన బలమైన పాత్రగా దర్శకుడు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. దర్శకుడు రవీంద్ర పుల్లె ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక చేసిన సాహసోపేత స్టంట్స్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కేరళలోని ప్రసిద్ధ అతిరపల్లి జలపాతం వద్ద ఒక కీలక యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించినట్లు తెలిపారు. ఆ సీన్‌లో భాగంగా రష్మిక ఎలాంటి డూప్ లేకుండా దాదాపు 80 అడుగుల ఎత్తు నుంచి జంప్ చేసినట్లు చెప్పారు. ఈ స్టంట్ సమయంలో ఆమె చేతులు, కాళ్లకు గాయాలు అయినప్పటికీ, ఎలాంటి విశ్రాంతి తీసుకోకుండా షూటింగ్ కొనసాగించారని వెల్లడించారు. ఆమె అంకితభావం చూసి యూనిట్ సభ్యులంతా ఆశ్చర్యానికి గురయ్యారని దర్శకుడు పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి ప్రమాదకర సన్నివేశాలకు డూప్‌లను ఉపయోగిస్తుంటారు. కానీ రష్మిక మాత్రం స్వయంగా చేయడం ఆమె డెడికేషన్‌కు నిదర్శనమని అన్నారు.



## అగ్రిమెంట్ చేసుకుని అవకాశాలు ఇవ్వట్లేదు..



వెబ్ సిరీసుల్లో అవకాశం ఇస్తానని మోసం చేశారని, ఇపుడు తన భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందని, అందువల్ల తాను ఆత్మహత్య చేసుకుంటానని యువనటి అనుగ్రహ ఎస్. నంబియార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒక వీడియోను రిలీజ్ చేశారు. ‘అడిపోలి’ ద్వారా వెండితెరకు పరిచయమైన అనుగ్రహ... ప్రస్తుతం ‘రిసార్ట్’ అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నారు. ఇందులో హీరోగా విజయ్ కుమార్ నటిస్తున్నారు. ఈ వెబ్‌సిరీస్ లో నటించేందుకు యేడాది పాటు అనుగ్రహ ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ, ఇప్పుడు అవకాశం ఇవ్వకుండా మోసం చేస్తున్నారంటూ ఆమె విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. ‘ఇపుడు నేను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యా. వెబ్‌సిరీస్ లో నటించేందుకు ఒక యేడాదికి అగ్రిమెంట్ కుదుర్చుకుని షూటింగ్‌కు పిలవడం లేదు. ఇతర చిత్రాల్లో నటించేందుకు కూడా అనుమతించడం లేదు. గత నాలుగు నెలలుగా ఇంటికే పరిమితమై ఉన్నా. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. చిత్రనిర్మాణ సంస్థను సంప్రదించగా, హీరో విజయ్ కుమార్‌ను సంప్రదించాలని చెప్పారు. దీంతో నా స్నేహితుడు విజయ్ కుమార్‌ను సంప్రదించగా ఆయన సమాధానం ఇవ్వకపోగా, ఆయన భార్య పరుష పదజాలంతో బెదిరింపు ధోరణితో మాట్లాడారు. కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నటించేందుకు అవకాశం ఇవ్వాలి. నేను కేరళ నుంచి ఇక్కడకు వచ్చాను. నాకు కలలు ఉంటాయి. ఛాన్స్ ఇవ్వకుంటే ఆత్మహత్యే నాకు శరణ్యం’ అని పేర్కొన్నారు.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com